

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 18 అక్టోబరు 2024



సీఈఐఆర్‌తో భరోసా

మీరు మార్కెట్ చేస్తుండగా మీ మొబైల్‌ను ఎవరైనా కొట్టేశారా?
బస్సు ఎక్కుతున్నప్పుడు మీ ఫోన్ జారిపోయిందా?
మీరు ఎక్కడైనా ఫోన్ పెట్టి మరచిపోయారా?

అయితే ఇక ఆలస్యం ఎందుకు.. వెంటనే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను ఆశ్రయించండి. మీ ఫోన్ ఎక్కడ ఉందో క్షణాల్లో ట్రాక్ చేస్తుంది. ఎవరి వద్ద ఉందో ఇట్టే కనిపెట్టేస్తుంది. మళ్లీ తిరిగి మీకు అప్పగించేందుకు సహాయం చేస్తుంది. ఇటువంటి అద్భుతమైన వెబ్‌సైట్‌ను కేంద్ర టెలికం శాఖ సంచార్ సాథి పేరుతో మనకు అందుబాటులోకి తెచ్చింది. ఫోన్ బాధితులకు భరోసాగా నిలిచే సీఈఐఆర్‌పై ప్రత్యేక కథనం మీ కోసం..

- మిస్ అయిన మొబైల్ ఫోన్ల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్
- సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్‌తో మెరుగైన ఫలితాలు
- ఫోన్ల ట్రాకింగ్‌కు ప్రత్యేకంగా టెక్నికల్ టీం

ఇక రాచమార్గం

ఎయిర్‌పోర్టు కారిడార్ బ్యూటిఫికేషన్‌కు నేడు శంకుస్థాపన

- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ ఆలోచనకు శ్రీకారం
- తొలిదశలో ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు..
- రెండోదశలో ఎయిర్‌పోర్టు నుంచి పెద అవుటపల్లి వరకు..
- ఎయిర్‌పోర్టు కారిడార్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు
- చైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ, తొమ్మిది మంది సభ్యులు

మెట్రోపాలిటన్ నగరాలైన చెన్నై, బెంగళూరు తరహాలో, అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవాడ ఎయిర్‌పోర్టు కారిడార్ మార్గాన్ని సుందరీ కరించేందుకు సర్వం సిద్ధమైంది. ఫిల్మ్‌సిటీ తరహా ఆర్కిటెక్ట్ నైపుణ్యాలు, అత్యద్భుత ల్యాండ్ స్కేపింగ్‌తో అబ్బురపరిచే ఈ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే 16వ నెంబరు జాతీయ రహదారి వీఐపీ కారిడార్‌ను అందంగా తీర్చిదిద్దే పనులకు శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. గన్నవరం నుంచి రాజధానికి తీసుకెళ్లే ఈ మార్గాన్ని సుందరీకరించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆలోచన చేశారు. ఈ ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబుతో పంచు కున్నారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో శాఖలన్నీ కదిలాయి.

శాఖల సమన్వయంతో కమిటీ

విమానాశ్రయ గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాన్ని, పరిసర ప్రాంతాలతో పాటు ఎన్‌హెచ్-16 వీఐపీ కారిడార్ మార్గాన్ని సుందరీకరించేందుకు ఎయిర్‌పోర్టు, ఎన్‌హెచ్, పంచాయతీరాజ్, అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ శాఖలన్నింటినీ ఎమ్మెల్యే యార్లగడ్డ ఏకతాటిపైకి తెచ్చారు. ఇందుకోసం మూడు రోజుల కిందట అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వారు.. ల్యాండ్ స్కేపింగ్ ఆర్కిటెక్ట్ డిజైన్లు రూపొందించారు. అన్ని శాఖల నేతృత్వంలో గురువారం కూడా సమావేశం జరిగింది. ఎయిర్‌పోర్టు ముందుభాగం, పరిసర ప్రాంతాలతో పాటు ఎన్‌హెచ్-16 వీఐపీ కారిడార్ మొత్తాన్ని సుందరంగా, శుభ్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే చర్చించారు. ఇందుకోసం కో-ఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ఎండీ, సభ్యులుగా జాతీయ రహదారుల సంస్థ పీడీ, విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్, కృష్ణా-ఎన్టీఆర్ జిల్లాల డీపీవోలు, గన్నవరం పోలీసు స్టేషన్ సీఐ, అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ జీఎంలు ఉంటారు. తొమ్మిది మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ పర్యవేక్షణలో సుందరీకరణ, పారిశుధ్య పనుల పర్యవేక్షణ జరుగుతుంది.

రెండు దశల్లో పనులు

మొత్తం రెండు దశల్లో కారిడార్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మొదటి దశలో ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు చేపడతారు. మొదటి ప్యాకేజీగా ఎయిర్‌పోర్టు నుంచి కేసరపల్లి జంక్షన్ వరకు, ఎయిర్‌పోర్టు గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాన్ని సుందరీకరిస్తారు. అందమైన ల్యాండ్ స్కేపింగ్‌తో కనిపించేలా దీనిని అభివృద్ధి చేస్తారు. ఇది ఫిల్మ్‌సిటీలోని ల్యాండ్ స్కేపింగ్ లా ఉంటుంది. దీనికోసం అద్భుతమైన ఆర్కిటెక్ట్ డిజైన్లను అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులు రూపొందించారు. మొదటి దశ పనులు 15 రోజుల్లో పూర్తిచేసి, ఎయిర్‌పోర్టు నుంచి పెద్ద అవుటపల్లి వరకు రెండోదశ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నిర్ణయించారు.



పరిహారం కోసం రికార్డులే మార్చేశారు!

భూ సేకరణ నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం కొట్టేసేందుకు మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసీల్దార్ పక్కా ప్లాన్ వేశాడు. నేషనల్ కాలేజీ ట్రస్ట్ పేరుతో ఉన్న భూమిలో ఓ 25 సెంట్ల భూమికి అనుభవదారుగా ఓ మహిళ పేరును నమోదు చేసి ఏకంగా అడంగల్‌నే మార్చేశాడు. ఆ భూమి ఆమెదేనంటూ క్షేత్ర పరిశీలన నివేదిక సైతం తయారు చేసి ఆర్డీవోతో సంతకం కూడా పెట్టించేశాడు. పరిశీలన నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఫైల్‌లో తేడాలు గమనించి ఆపడంతో వెంటనే క్లియర్ చేయాలని వారిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారినట్లు తెలిసింది. -ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

- బందరు కోటలో సంప్ కం పంప్ హౌస్ నిర్మాణం కోసం భూసేకరణ
- 526-2 సర్వే నంబర్లో నేషనల్ కాలేజ్ ట్రస్ట్‌కు 4.25 ఎకరాల భూమి
- ఆ భూమిలో 25 సెంట్లకు అనుభవదారుగా ఓ మహిళ పేరు అక్రమంగా నమోదు
- ఆ 25 సెంట్ల భూమికి రూ.3..52 లక్షలు పరిహారంగా విడుదల
- రికార్డులు తారుమారు చేయడంలో ఆర్డీవో కార్యాలయ ఉద్యోగి హస్తం

తహసీల్దార్ కార్యాలయ పరిశీలనతో వెలుగులోకి..

సంప్ కం పంప్‌హౌస్ నిర్మాణం కోసం భూసేకరణ

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో భారీ వర్షాలు కురిసిన సమయంలో డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తుం టా యి. నీరు త్వరితగతిన బయటకు వెళ్లదు. ఈ నేపథ్యంలో మురుగు నీటిని పంపింగ్ చేసేందుకు సంప్ కం పంప్ హౌస్ నిర్మాణం చేయాలని ప్రణాళిక రూపొం దించారు. నగరానికి తూర్పు వైపున ఉన్న బం దరు కోటలో 25సెంట్ల భూమిని సేకరించాలని కలెక్టర్ ఈ ఏడాది మార్చి 5వ తేదీన మచిలీపట్నం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ అధికారులకు లేఖ రాశారు. దీని ఆధారంగా బందరు కోట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 526-2లో 4.25 ఎకరాల భూమి నేషనల్ కాలేజ్ ట్రస్ట్ పేరున ఉందని, అందులో 25సెంట్ల భూమిని సంప్ కం పంప్‌హౌస్ నిర్మాణం కోసం తీసుకుంటున్నామని, భూసేకరణ చేసేందుకు గాను రూ.3.52లక్షలను విడుదల చేయాలని సీసీఎల్ఏకు లేఖ రాశారు. ఈ భూమి సేకరణ నిమిత్తం ప్రభుత్వం రూ.3.52 లక్షలను విడుదల చేసింది.

రెవెన్యూ రికార్డులు మార్చేసి మరీ..

బందరు కోటలో సంప్ కం పంప్ హౌస్ నిర్మాణం కోసం భూ సేకరణ నిమిత్తం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసీల్దార్ ఆ నగదు కొట్టేసేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. సర్వే నంబరు 526-2లో పట్టాదారు పేరు ఉన్న కాలమ్‌లో నేషనల్ కాలేజ్ ట్రస్ట్ పేరున 4.25 ఎకరాల భూమి ఉన్నట్లు చూపిస్తూ, అనుభవదారు పేరు కాలమ్‌లో మాత్రం వెంకటరత్నమ్మ అనే మహిళ పేరున 25 సెంట్ల భూమి ఉన్నట్లుగా అడంగళ్‌లో మార్చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత భూసేకరణకు సంబం దించి చకా చకా సర్వే చేసి రిపోర్టును తయారు చేసి, సర్వే నంబరు 526-2లోని 4.25 ఎకరాల భూమిలోని 25 సెంట్ల భూమికి వెంకటరత్నమ్మ అనుభవదారుగా ఉన్నట్లు తన పరిశీలనలో వెల్లడైనట్లుగా నివేదికను కూడా తయారు చేసి నట్లు సమాచారం. సర్వేయరు, తాను పరిశీలించిన తర్వాతనే ఈ నివేదికను ఇస్తున్నట్లు రిపోర్టు రాసినట్లు తెలి సింది. వెం కట రత్నమ్మకు రూ.25 సెంట్ల భూమిని ఇచ్చినందుకు గాను రూ.3.25 లక్షల నగదును ఆమె పేరున విడుదల చేయాలని నివేదికలో కోరినట్లు సమాచారం. ఈ ఫైల్‌పై ఆర్డీవోతో ఈ నెల 9న సంతకం కూడా చేయించినట్లు తెలిసింది.

సంప్ కం పంప్‌హౌస్ నిర్మాణం కోసం భూమి సేకరణకు సంబంధించిన ఈ ఫైలు మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయానికి పరిశీలన నిమిత్తం వచ్చింది. రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుగా నేషనల్ కాలేజ్ ట్రస్ట్ పేరు, అనుభవదారుగా వెంకట రత్నమ్మ పేరు ఉండటంతో అక్కడి అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో వారు ఈ 25 సెంట్ల భూమికి సంబంధించి అసలైన భూమి పత్రాలను చూపాలని వెంకట రత్నమ్మను కోరారు. అయితే వారు మాత్రం ఆ పత్రాలు చూపడం లేదు. ఈ క్రమంలో నేషనల్ కాలేజ్ ట్రస్ట్ నుంచి ఈ 25 సెంట్ల భూమి మాదికాదని లిఖిత పూర్వకంగా తీసుకువస్తే, పరిశీలించి అనుమతులు ఇస్తామని తహసీల్దార్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆర్డీవో కార్యాలయ అధికారులకు తెలియజేశారు. కానీ ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసీల్దార్ ఈఫైలుకు త్వరితగతిన ఆమోదం తెలపాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి పత్రాలు ఉంటేనే ఆమోదిస్తామని, లేకుంటే అన్ని వివరాలతో జేసీ, కలెక్టర్‌కు నివేదిక పంపుతామని మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు.

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ.6.26 కోట్లు 8లో

గంజాయి తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు 6లో

విషజ్వరాల విజృంభణ 6లో

ప్రేమకథా చిత్రమ్



- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు
- యాప్‌ల్లో పరిచయాలు.. ప్రేమాయణం
- ఆ తర్వాత ప్రేయసితో కలిసి నేరాయణం
- కొన్నాళ్ల పాటు చాటింగ్, వీడియో కాలింగ్
- తర్వాత సిమ్‌లు కొనాలంటూ కోరికలు
- బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలని ఆదేశాలు
- తెలియక మోసపోతున్న యువతులు
- నగరంలో పెరుగుతున్న కేసులు

నగరానికి చెందిన ఓ యువతి గూగుల్ ప్లేస్టోర్‌లో స్టార్‌మేకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఇది పాటలకు సంబంధించిన యాప్. వివిధ భాషల్లో పాటలు పాడొచ్చు. ఇందులో చాటింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఇలా ఈ యువతి టర్కీ దేశానికి చెందిన యువకుడితో పరిచయం పెంచుకుంది. ఈ అమ్మాయికి పాటలపై ఆసక్తి ఉండటంతో తెలుగులో పాటలు పాడి యాప్‌లో పోస్ట్ చేసేది. టర్కీ యువకుడు ఇంగ్లీష్‌లో పాటలు పాడి పోస్ట్ చేసేవాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి టర్కీ యువకుడు మాట ఇచ్చాడు. త్వరలో విజయవాడకు వచ్చి ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడతానని చెప్పాడు. ఇది జరిగిన కొన్ని రోజులకు ఆమెకు వీడియోకాల్ చేశాడు. విజయవాడలో ఎనిమిది కొత్త సిమ్‌కార్డులను ఆమె పేరు మీద తీసుకోవాలని సూచించాడు. తర్వాత ఎనిమిది బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, ఒక్కో ఖాతాకు ఒక్కో సిమ్ నెంబరును అనుసంధానం చేయించమని చెప్పాడు. ఆ సిమ్‌లను, బ్యాంకు ఏటీఎంలను పలానా చోటకు పంపాలని ఢిల్లీలో ఒక చిరునామాను ఆమెకు చెప్పాడు. అతను చెప్పినట్టుగానే ఆ యువతి ఢిల్లీ చిరునామాకు ఏటీఎం కార్డులు, కొత్త సిమ్‌కార్డులు కొరియర్ చేసింది. ఆ తర్వాత మోసపోయానని తెలుసుకుని లబోదిబోమంది. ఇది నగరంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రేమకథ కాదు.. నేరకథ..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒకప్పుడు సైబ ర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కూలీల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేవారు. ఏటీఎం కార్డును మాత్రం తమ వద్ద పెట్టుకునేవారు. వివిధ వ్యక్తులను బెదిరించి ఆ ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకునేవారు. ఏటీఎం కార్డులతో ఆ డబ్బును డ్రా చేసుకునేవారు. తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే అందుబాటులోకి వచ్చాక వాటిని నగదు లావాదేవీలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఒక ఫోన్ నెంబర్‌తో అనుకున్న టార్గెట్ చేరుకోగానే, దాన్ని తీసి పక్కన పెట్టేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంత ప్రజానీకాన్ని టార్గెట్‌గా వాడుకున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు నగరవాసులను ఎంపిక చేసుకుంటున్నారు. ఖాతాలు తెరిచి సిమ్‌కార్డులు, ఏటీఎం కార్డులు సమకూర్చడానికి యువతులకు ఎర వేస్తున్నారు.

నమ్మించి.. మోసగించి..

ప్రస్తుతం యువత తమలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి సామాజిక మాధ్యమాలను ఎక్కువగా విశ్వసిస్తోంది. ఈ ట్రెండ్ పెరగటంతో గూగుల్ ప్లే స్టోర్‌లో కొత్తకొత్త యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. పాటలకు సంబంధించి స్టార్‌మేకర్, స్మూల్, సింప్లీ సింగ్, సింగ్‌స్పాట్, రియాజ్, వుయ్‌సింగ్ వంటి యాప్‌లు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ యాప్‌ల్లో స్థానిక భాషల్లో పాటలు పాడి పోస్ట్ చేయొచ్చు. మనపక్కన లేకుండా ఎక్కడో ఉన్న వారితో కలిసి గీతాలు ఆలపించవచ్చు. ఈ ప్రక్రియలో యువతీ యువకుల మధ్య పరిచయాలు పెరుగుతున్నాయి. ఈ పరిచయాలు ప్రేమగా మారుతున్నాయి. విదేశాల్లో ఉంటున్న యువకులు యువతులను ఇలా ముగ్గులోకి దింపాక అసలు స్కెచ్‌ను అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేసిన ఈ స్కెచ్‌లను తాజాగా తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు.

ప్రేమ పేరిట పక్కా మోసం

మధురానగర్‌కు చెందిన యువతిని టర్కీ దేశానికి చెందిన యువకుడు ఇలాగే ఉపయోగించుకున్నాడు. తాను చేసే సైబర్ నేరాలకు సంబంధించిన డబ్బు జమ చేయించుకుని, డ్రా చేసుకునేందుకు ఆమెతో విజయవాడలో ఎనిమిది బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించాడు. ఆ ఖాతాలకు అనుసంధానం చేయడానికి ఎనిమిది కొత్త సిమ్‌కార్డులను కొనుగోలు చేయించుకున్నాడు. ఈ ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులను ఢిల్లీలో చిరునామా ఇచ్చి అక్కడకు కొరియర్ చేయమని సూచించాడు. టర్కీ యువకుడే ఏరికోరి పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో జీవితంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భావించిన ఆమె తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తండ్రి దగ్గరుండి మరీ ఆమె పేరున సిమ్‌కార్డులు కొని, బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. ఇందులో ఒక ఖాతాలో ఆమె తెలియకుండా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆమె పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే కొరియర్‌ను ఢిల్లీ చిరునామాకు పంపేయడంతో ఆయా

మిగతా 6వ పేజీలో...

ట్రేడ్ లైసెన్స్‌ల మాయాజాలం



- లక్ష జనాభా ఉన్న గుడివాడలో కేవలం 1,4,50 లైసెన్సులు
- ఎక్కడికక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీల అనధికార వసూళ్లు
- కోట్ల రూపాయలు నష్టపోయిన మున్సిపాల్టీ
- ఆంధ్రజ్యోతి బృందం పరిశీలనలో వెలుగుచూసిన సంచలన విషయాలు

ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరులో గుడివాడ మున్సిపల్ అధికారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. లక్ష జనాభా ఉన్న పట్టణంలో కేవలం 1,4,50 లైసెన్సులే ఉన్నట్లు లెక్కల్లో చూపి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు అనధికార వసూళ్ల దందా నడుపుతున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండిపడుతోంది. ఆంధ్రజ్యోతి ప్రతినిధుల బృందం జరిపిన పరిశీలనలో సంచలన విషయాలు వెలుగుచూశాయి.

ఆంధ్రజ్యోతి, గుడివాడ: మున్సిపాల్టీ, గ్రామ పం చాయతీల్లో వ్యాపారాలు నిర్వహించాలంటే ఖచ్చితంగా ట్రేడ్ లైసెన్స్ పొందాలి. గుడివాడ పట్టణంలోని కిళ్లీ బడ్డీ, కళాశాలలు, పాఠశాలలు, లాడ్జిలు, సినిమా థియేటర్లు, ఆస్పత్రులు, గోడౌన్‌లు, హోటళ్లు, పెద్ద మాల్స్, చిన్న, మధ్య తరహా భారీ పరిశ్రమలు వంటి వ్యాపారాల నిర్వహణకు మున్సిపాల్టీ అనుమతి తప్పనిసరి. ప్రతి వ్యాపారి నిర్దేశిత రుసుము చెల్లిస్తే రెవెన్యూ అధికారులు పరిశీలించి లైసెన్స్ ఇస్తారు. ఒకే వ్యాపారికి ఎన్ని వ్యాపారాలుంటే అన్ని ట్రేడ్ లైసెన్స్‌లను పొందాల్సి ఉంది. తీసుకున్న లైసెన్స్‌ను అధికారులకు కనిపించేలా పెట్టాల్సి ఉంది. రెన్యువల్ కానీ, లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న వ్యాపారాలపై మున్సిపాల్టీ కొరడా ఝుళిపించవచ్చు. రెన్యువల్ చేయకున్నా, లైసెన్స్ లేకున్నా దుకాణానికి తాళం వేసి సీజ్ చేసే హక్కు మున్సిపాల్టీకి ఉంది. ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలాఖరు లోపు తప్పనిసరి ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలి. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు.

మున్సిపాల్టీలో 1,450 ట్రేడ్ లైసెన్స్‌లేనా?

లక్ష మంది జనాభా ఉన్న గుడివాడ మున్సిపాల్టీ పరిధిలో కేవలం 1,450 ట్రేడ్ లైసెన్స్‌లుండటం ఆశ్చర్యకర విషయం. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 15 వేల నుంచి 18 వేల వరకు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. మున్సిపల్ గెజిట్‌లో పేర్కొన్న విధంగా వ్యాపారాన్ని బట్టి లైసెన్స్ రుసుము ఉంటుంది. ఈ లెక్కన మున్సిపాల్టీ ఏడాదికి ఆదాయం రూ.40 లక్షలు కోల్పోతుంది. కానీ మున్సిపల్, రెవెన్యూ విభాగాల అధికారుల నిర్లక్ష్యంతో 1,450 ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రమే చెల్లుబాటులో ఉన్నాయి. వీరు కూడా ప్రతి ఏడాది ఫీజులను పూర్తి స్థాయిలో చెల్లించరు. గత దశాబ్ద కాలంగా అటు ఇటుగా ఇదే అంకెను మున్సిపల్ అధికారులు మెయిన్‌టెన్ చేస్తుండటం గమనార్హం. బ్యాంకు రుణాలు, ఆర్థిక సంబంధిత వ్యవహారాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి కాబట్టే లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకుంటున్నారు. వ్యాపారులే వచ్చి లైసెన్స్ రెన్యువల్ ఫీజు కడితే లేదా కొత్త లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుంటే తప్పా అడిగే నాథుడే ఉండడు.

మిగతా 6వ పేజీలో...

శానిటరీ సిబ్బంది చేతివాటం

మున్సిపాల్టీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌లు కట్టే వారి సంఖ్య చాలా తక్కువ. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు ప్రైవేటుగా జాబితాను సిద్ధం చేసుకుని సొంతంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు వ్యాపారులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలతో కలిసి అనధికారికంగా ట్రేడ్ లైసెన్స్‌ను వసూలు చేసుకుని కింద స్థాయి మేస్త్రీ నుంచి ఉన్నతాధికారి వరకు జేబులు నింపుకుంటున్నట్లు కార్యాలయంలో ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



సాగు.. సాగేనా! సముద్రనీటిలో నారుమడులు, నాటేసిన పొలాలు 6లో



ఇసుక తోడేస్తున్నారు

కుగ్రామం నుంచి డిప్యూటీ కలెక్టర్ దాకా..

» *బందరు ఆర్డీవో స్వాతి విజయప్రస్థానం*



(ఆంధ్యజ్యోతి - మచిలీపట్నం టౌన్)

పట్టుదల, కృషి ఉంటే విజయం సాధించొచ్చని నిరూపించారామె. సామాన్య, పేద రైతు కూలీ కుటుంబంలో ఓ కుగ్రామంలో జన్మించినా, బ్యాలం నుంచి ఎన్నో సవాళ్లు ఎదురైనా ఎస్సైగా ఉద్యోగం సాధించారు. అంతటితో సంతృప్తి చెందక డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగారు. మొదటి పోస్టింగ్‌గా మచిలీపట్నం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల్లోనే పెండింగ్ ఫైళ్లపై దృష్టి సారించారు. ప్రజలు ఏ సమస్యను తీసుకెళ్లినా వారి ఎదుటే తహసీల్దార్‌కు ఫోన్ చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న బందరు ఆర్డీవో స్వాతితో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: మీ విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది?

జవాబు: మాది అనంతపురం జిల్లా పరిగి మండలం గుర్వానహళ్లి. పేద కుటుంబంలో జన్మించాను. తల్లిదండ్రులు చదువుకోలేదు. తండ్రి వ్యవసాయ కార్మికుడు. తల్లి టైలర్. స్వగ్రామంలో ప్రాథమిక విద్య, తర్వాత హిందూపూర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాను.

ప్రశ్న: డిగ్రీలో, పీజీలో గోల్డ్‌మెడల్స్ ఎలా సాధ్యమైంది?

జవాబు: హిందూపూర్‌లో బీఎస్సీ చదివాను. బీఎస్సీలో అధిక మార్కులు సాధించి ఎమ్మెల్యే నుంచి గోల్డ్‌మెడల్ పొందాను. నా తల్లి ప్రోత్సాహం తోనే డిగ్రీ చేశాను. ఆమె టైలరింగ్ చేస్తూ వచ్చిన ఆదాయంతో నన్ను చదివించారు. డిగ్రీలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ నన్ను ప్రోత్సహించడంతో ఎస్వీ యూనివర్సిటీలో పీజీ చేశాను. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో మళ్లీ గోల్డ్‌మెడల్ సాధించాను. 2015లో సీఎం చంద్రబాబు నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నాను. కష్టపడి చదివితే విజయాలు సాధ్యమని నమ్మాను. అందుకే విజయాలు సాధించాను.

ప్రశ్న: మీ తొలి ప్రభుత్వ ఉద్యోగం?

జవాబు: తొలుత ఎస్సై ఉద్యోగం కోసం ప్రిపేర్ అయ్యాను. కఠినంగా వ్యాయామం చేశాను. తిరుపతి అర్బన్‌లో ఎస్సై ఉద్యోగం దక్కింది.


ప్రశ్న:. ఎస్సై ఉద్యోగంతో సంతృప్తి చెందలేదా?

జవాబు: ఎస్సైగా కొంత మందికే సేవలందించగలను. డిప్యూటీ కలెక్టర్‌గా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలనే లక్ష్యంతో చదివాను. డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ ఉద్యోగం సాధించగలిగాను. డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చాక గుంటూరులో ఏడాది పాటు శిక్షణ పొందాను. ఆ తర్వాత మచిలీపట్నంలో మొదటిసారిగా ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించాను.

ప్రశ్న: మచిలీపట్నం ఆర్డీవోగా బాధ్యతలు ఎలా ఉంది?

జవాబు: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆర్డీవోగా చేరడం ఎంతో సంతోషంగా ఉంది. కలెక్టర్, డీఆర్వోలు ఇచ్చే సూచనలు పాటిస్తున్నా. నా వద్ద పనిచేసే తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నా. అభివృద్ధి సాధించేందుకు కష్టపడటం అవసరమని బాల్యం నుంచి నేర్చుకున్నా. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తా.

కోడూరు శివారు దింటిమెరక, హంసలదీవి, పాలకాయితిప్ప సమీపంలోని భూముల్లో ఈ ఏడాదైనా సాగు..సాగేనా! అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. సముద్ర కరకట్ట వద్ద ఏర్పాటు చేసిన పాలకాయితిప్ప అవుట్‌ఫాల్స్, కృష్ణానది కరకట్టపై ఏర్పాటు చేసిన కోడూరు అవుట్‌ఫాల్స్‌కు స్లూయిజ్ గేట్లు లేకపోవడంతో మండలం దిగువ ప్రాంతంలో నాలుగేళ్లుగా సుమారు 4 వేల ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. ఏటా నారుమడులు పోయడం, నాట్లు వేయడం చేస్తున్నప్పటికీ సముద్రపు నీరు కారణంగా ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైసీపీ పాలనలో అనేకమార్లు ప్రత్యేక నిపుణులను తీసుకువచ్చి ముంపునకు కారణాలను పరిశీలించారు. ప్రధాన కారణమైన అవుట్ ఫాల్ స్లూయిస్‌లను నిర్మించి సమస్యకు పరిష్కారాన్ని చూపుతామని నాటి పాలకులు చెప్పినా కాలయాపన చేశారు.



ఈస్ట్ చానల్ 15వ నెంబర్ కాల్వ కింద నీటమునిగిన వరి నాట్లు

సాగు.. సాగేనా!



ముంపునకు కారణమవుతున్న పాలకాయితిప్ప అవుట్ ఫాల్స్

సముద్రనీటితో మునిగిపోతున్న నారుమడులు, నాట్లేసిన పొలాలు

» కరకట్టపై అవుట్‌ఫాల్ గేట్లు లేకపోవడంతో నాలుగేళ్లుగా పొలాల్లోకి ఉప్పునీరు

» గేట్లు నిర్మించి..సమస్యకు పరిష్కారం చూపాలని రైతుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి-కోడూరు)

అందని ప్రభుత్వసాయం

కోడూరు శివారు దింటిమెరక, హంసలదీవి, పాలకాయితిప్ప సమీప భూముల్లో పంట వేసి నష్టపోతున్న రైతులకు ప్రభుత్వ సాయం కూడా కరువైంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు అందించే రైతు భరోసా వీరికి వర్తించడం లేదు. ఈ భూములన్నీ 22/ఏ నిషేధిత జాబితాలో ప్రభుత్వం చేర్చడంతో వీరికి ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం తదితర లబ్ధి చూకూరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బీడు బారిన భూములన్నీ సాగు భూములుగా మార్చటమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు. దీంతో రైతులు ఈ ఏడాది కొండంత ఆశతో నారుమడులు పోసుకున్నారు. కానీ కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి, వరదల తాకిడికి నారుమడులు అన్ని మునిగిపోయి, కుళ్లిపోయాయి. మళ్లీ సాగు చేద్దామని రెండోసారి నారుమడులు పోసి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కానీ ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రం అలలతో ఎగిసిపడుతూ భారీ పోటు వస్తోంది. సముద్రపు కరకట్టకు ఉప్పునీరు ఎగువకు రాకుండా ఏర్పాటు చేసిన అవుట్ ఫాల్ గేట్లు లేకపోవటంతో మళ్లీ గతంలో మాదిరిగానే ఉప్పునీరు వచ్చి నారుమడులను పంట పొలాలను ముంచేస్తోంది. రెండుసార్లు నారుమడులు పోసి నాటుకు సిద్ధం చేసినప్పటికీ మళ్లీ పంట పొలాల ముంపు బారిన పడడంతో రైతులు ఈ ఏడాదైనా నాట్లు వేస్తామా..పంట చేతికి వస్తుందా? అంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ముంపునకు ప్రధాన కారణమైన అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పునర్నిర్మాణం చేసి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ఇప్పటికీ రెండుసార్లు నారుమడులు పోసి నాట్లు వేశాం. ఎకరానికి రూ.14 వేల నుంచి 15 వేలు ఖర్చు పెట్టాం. మరలా పంట పొలాలు ముంపుబారినపడ్డాయి. నష్టపరిహారం అందడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-కె.నాగరాజు, రైతు

ముంపు నుంచి రక్షణ కల్పించాలి

అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు లేకపోవటంతో ఏటా పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా రక్షణ చర్యలు చేపట్టి, ముంపు నుంచి కాపాడాలి

-పడమటి దుర్గారావు, రైతు

స్వచ్ఛ చల్లపల్లి కోసం అమెరికాలో 100 కి.మీ పరుగు

» 16 గంటలు ఏకధాటిగా పరుగెత్తి .. రూ.5లక్షలు సేకరించిన ఎన్నారై



అమెరికాలో స్వచ్ఛ చల్లపల్లి జెండాతో ఎన్నారై నాదెళ్ల సురేష్

చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లి కోసం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు నాదెళ్ల సురేష్ అమెరికాలో 100 కిలోమీటర్లు పరుగెత్తి రూ.5 లక్షలు సేకరించారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలో విజయవంతంగా పరుగు ముగించిన సురేష్..శిక్షకుడు బిల్ ఓడెన్‌డాల్‌తో కలిసి స్వచ్ఛ సుందర చల్లపల్లి తెలుగు బ్యానర్‌ను ప్రదర్శించారు. సేకరించిన విరాళాన్ని తల్లిదండ్రులు నాదెళ్ల పూర్ణచంద్రరావు, కుసుమ కుమారి ద్వారా గురువారం స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతులకు అందజేశారు. గతంలోనూ నాదెళ్ల సురేష్ అమెరికాలో స్వచ్ఛ చల్లపల్లి కోసం పరుగు నిర్వహించి విరాళాన్ని సేకరించి మన కోసం మనం ట్రస్ట్‌కు అందించారు.



చల్లపల్లి సీఆర్ ట్రస్ట్ వద్ద మాట్లాడుతున్న కె.నారాయణ

ఏపీలోనూ సీఆర్ ఫౌండేషన్ సేవలు

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించి, ఏపీలోనూ ఫౌండేషన్ స్థాపించి పేదలకు అందుబాటులోకి తెస్తామని సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. గురువారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లిలోని చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు అనుసంధానం చేసి అభివృద్ధి చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

ప్రేమకథా చిత్రమ్

(ఐదో పేజీ తరువాయి)

బ్యాంకులకు వెళ్లి ఖాతాలను రద్దు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అదేవిధంగా ఆ సిమ్‌కార్డులను బ్లాక్ చేయించాలని స్పష్టం చేశారు.

ప్రతిభ ముసుగులో పరిధి దాటొద్దు

యువతీ యువకులు టాలెంట్‌ను నిరూపించుకోవడానికి, ప్రదర్శించడానికి అనేక సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగిస్తున్నారు. వారి టాలెంట్‌కు సంబంధించిన ప్రదర్శనను చూపించడం వరకు పర్వాలేదు. అవతలి వ్యక్తులు ఎవరో తెలియకుండా పరిచయాలు పెంచుకుంటే ఇబ్బందులు వస్తాయి. సోషల్ మీడియా యాప్‌ల్లో యాక్టివ్‌గా ఉండే యువతులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

- గుణరాము, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

ఓటర్ల జాబితాల్లో ఇంకా తప్పులా?

- వెంటనే సరిచేసి ఇవ్వండి
- సిబ్బందికి ఆర్డీవో స్వాతి ఆదేశం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): 'ఓటర్ల జాబితాల్లో ఇంకా తప్పులు ఏంటి? జాబితాలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిశీలించి సరిచేయండి. తల్లిదండ్రులు ఒక పోలింగ్ బూత్‌లో, పిల్లలు వేరే పోలింగ్ బూత్‌లో ఉన్నారేమో చూడండి. ఇంటికి దగ్గరగా ఉండే పోలింగ్ బూత్‌లోనే ఓటర్ల పేర్లు ఉండాలి.' అంటూ బందరు ఆర్డీవో కె. స్వాతి మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందికి సూచించారు. గురువారం మునిసిపల్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. నగరంలోని ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై మునిసిపల్ కార్యాలయం ప్లానింగ్ విభాగంలో రెవెన్యూ సిబ్బందితో పాటు మునిసిపల్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నాలుగు రోజులుగా జాబితాలను పరిశీలించి, విచారణ జరుపుతున్నారు. సచివాలయాల పరిధిలో ఓటర్లతో ఒక సారి సంప్రదించి ఓటర్ల జాబితాల్లో మార్పులు, కూర్పులు, చేర్పులు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఇష్టారాజ్యంగా మార్పులు చేయొద్దని సూచించారు. మచిలీపట్నం కొబ్బరితోటలోని 51, 52 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలను మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సమక్షంలో ఆర్డీవో పరిశీలించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అఫీజా తదితరులు పాల్గొన్నారు. నగరంలో పారిశుధ్యంపై కమిషనర్ బాపిరాజును అడిగి ఆర్డీవో తెలుసుకున్నారు.

విషజ్వరాల విజృంభణ

» కిక్కిరిసిన ఆస్పత్రులు



జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్)

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంతో పాటు పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభించాయి. జ్వరాల బారిన పడిన ప్రజలతో జిల్లా ప్రభుత్వాస్పత్రితో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడిపోతున్నాయి. శరీర ఉష్ణోగ్రతలు 101-104 డిగ్రీల ఫారన్‌హీట్ నమోదవుతున్నాయని చెబుతున్నారు. వారం, పది రోజుల పాటు జ్వరం తగ్గకపోవడంతో మోకాళ్ల నొప్పులు, నీరసంతో యువకులు సైతం కదల్లేక మంచాలకు పరిమితమైపోతున్నారు. వైద్య పరీక్షల్లో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లుగా నిర్ధారణ అవుతున్నాయి. కొందరికి ముక్కుపైన నల్లటి మచ్చలు వస్తున్నాయి. కొందరిలో దగ్గు, జలుబు లక్షణాలుంటున్నాయి. ఇంట్లో ఒకరికి వైరల్ ఫీవర్ సోకితే ఇంటిల్లిపాదికి ఒకరి తర్వాత మరొకరికి సోకుతోంది. వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు.

వారం నుంచి చికిత్స పొందుతున్నా



వారం నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా. జ్వరం తగ్గడం లేదు. మా ఊళ్లో చాలా మందికి వైరల్ జ్వరాలు వస్తున్నాయి. రక్త, మూత్ర పరీక్షలు చేశారు. పొద్దున్న, సాయంత్రం మందులు ఇస్తున్నారు.

- కోటేశ్వరరావు, పెదయాదర

నీరసించిపోయా..



104 డిగ్రీల ఫారన్‌హీట్ జ్వరం వచ్చింది. నీరసించిపోవడంతో సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఆరు రోజులైంది. ఇప్పుడిప్పుడే ద్రవ పదార్థాలు తాగుతున్నా.

- శ్రీనివాసరావు, బంటుమిల్లి

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలందిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో జ్వరాలు వచ్చిన రోగులకు రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నాం. ఫీవర్ సర్వే చేయించాం. ఎవరికి జ్వరం వచ్చినా వెంటనే ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల సహకారంతో ఆస్పత్రుల్లో రోగులను చేర్పిస్తున్నాం. తక్షణ వైద్యసేవలందిస్తున్నాం. ఆస్పత్రుల్లో మందులకు కొరత లేదు. విషజ్వరాల కట్టడికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం.

- జి.గీతాబాయి, డీఎంహెచ్‌వో



కె.కొత్తపాలెం వద్ద పడవల్లో నుంచి ఎడ్ల బండ్లలోకి ఇసుక లోడింగ్

ఇసుక తోడేస్తున్నారు

» కృష్ణానదిలో నుంచి పడవల్లో తెచ్చి ఎడ్లబండ్ల ద్వారా తరలింపు

» అక్కడి నుంచి ట్రాక్టర్లలో లోడు చేసి ఇతర ప్రాంతాలకు

» ట్రక్కు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయాలు

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుకకు మోపిదేవి మండలంలో కొందరు వ్యాపారులు తూట్లు పొడుస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో కృష్ణానది గర్భం నుంచి పడవల్లో ఇసుక తోడి ఎడ్ల బండ్ల ద్వారా బయటకు చేరవేసి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రూ.5 వేల నుంచి 10 వేలకు విక్రయాలు సాగిస్తున్నారు. మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెంలో అధికారంలో ఉన్న ఒక వర్గం, ప్రతిపక్షంలోని మరో వర్గం కలసి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కె.కొత్తపాలెం వద్ద కృష్ణానదిలోకి నాలుగు పడవల్లో వెళ్లి ఇసుకను తోడి పడవల ద్వారా తెచ్చి ఎడ్ల బండ్లతో గ్రామంలో నిర్దేశించిన ప్రదేశంలో గుట్టలుగా వేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లకు లోడు చేస్తున్నారు. డిమాండ్ మేరకు ధర నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని కృష్ణానది ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని, సహజ వనరుల దోపిడీ, ఇసుక, బుసక అక్రమ రవాణా అరికట్టాలని పల్లెపండుగ గ్రామ సభల్లో రెండు రోజుల క్రితమే పోలీసు, రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. అయినా ఆయన ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ఎమ్మెల్యే చెప్పిన రెండో రోజే అక్రమ వ్యాపారాలకు తెరతీశారని గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, పోలీసుల దృష్టికి పడవల ద్వారా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం ఇచ్చినా కనీసం నిలువరించే ప్రయత్నాలు చేయలేదని తెలుస్తోంది. పట్టపగలే పడవల్లో ఇసుకను తెచ్చి వ్యాపారం చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

త్వరలో సహకార ఎన్నికలు

» రైతులే ఓట్లేసి పాలకవర్గాన్ని ఎన్నుకునేలా కార్యాచరణ: కొల్లు రవీంద్ర



మోపిదేవిలో కేడీసీసీ బ్రాంచ్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'కేడీసీసీ బ్యాంక్‌కు ఎంతో ఘన చరిత్ర ఉంది. త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. రైతులే ఓట్లువేసి పాలకవర్గాన్ని ఎన్నుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాచరణ రూపొందించారు.' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రూ.కోటి 10 లక్షలతో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ మోపిదేవి బ్రాంచి నూతన భవనాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గురువారం రవీంద్ర ప్రారంభించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులే బినామీలుగా రుణాలు పొంది సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్, బీఎం చంద్రశేఖర్, చల్లపల్లి, మోపిదేవి బ్రాంచ్ మేనేజర్లు నాగరాజ కుమారి, సల్మా సుల్తానా సయ్యద్, సర్పంచ్ నందిగం మేరీ రాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. గురువారం రాత్రి తన ఇంటి వద్ద విద్యుత్ శాఖ, షిప్పింగ్ హార్బర్ అధికారులు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో ఆయన సమీక్షా సమావేశాలు నిర్వహించారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. రెండేళ్ల క్రితం హార్బర్ నిర్మాణం ప్రారంభించినా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ఆయన ప్రశ్నించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు మరో 18 నెలలు పొడిగించినట్టు ఏపీ మారిటోరియం బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.కె.పల్లారావు మంత్రికి వివరించారు. బ్రేక్‌వాటర్ చివరలో సాంకేతిక కారణాల వల్ల పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. జిల్లాలో నాగాయలంక మండలం సొర్లగొంది, గుల్లలమోద గ్రామాలను క్లయిమేట్ రెసిలెస్ ఫిషర్‌మెన్ గ్రామాలుగా గుర్తించారని మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అవసరమైన పరికరాలపై ఆస్పత్రి ఆర్ఎంవో సీహెచ్ నిరంజన్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఆశ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ భాస్కర్‌తో చర్చించారు. విద్యుత్ ఎస్ఈ సత్యానందం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, జి.శ్రీనివాస్‌తో మంత్రి సమీక్షించారు. లో ఓల్టేజి ఉన్న ప్రాంతాల్లో రెండు అదనపు సబ్ స్టేషన్లు ప్రారంభించాలని ఆదేశించారు. మెడికల్ కళాశాలకు విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ సత్యానందంకు మంత్రి సూచించారు.

గంజాయి తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు

» నిందితుల వద్ద నాటు తుపాకీ..145 కిలోల గంజాయి స్వాధీనం

విజయవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నాటుతుపాకీని సీజ్ చేశారు. తమిళనాడులోని చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్‌కుమార్, రాణిపర్తి జిల్లా మేళకుప్పం ప్రాంతానికి చెందిన కుమారన్ మరిమూర్తి స్నేహితులు. వారు చెన్నై నుంచి బుధవారం ఉదయం బయలుదేరి తునికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ముఠా వారికి తుని వద్ద గంజాయిని అందజేసింది. సరుకును చెన్నైకి తీసుకెళ్లి విక్రయించాలనుకున్నారు. దీనికి వారం ముందుగా వారు ఇదే స్కెచ్‌ను అమలు చేశారు. తుని నుంచి గంజాయిని తీసుకెళ్లి చెన్నైలో విక్రయించారు. విశాఖ ముఠా నుంచి రెండు కిలోల గంజాయిని రూ.9వేలకు కొనుగోలు చేశారు. దాన్ని చెన్నైలో రూ.20వేలకు విక్రయించారు. వారం క్రితం వేసిన స్కెచ్ ఫలించడంతో బుధవారం ఉదయం అక్కడి నుంచి తునికి వచ్చారు. అక్కడ నుంచి గంజాయిని కారులో తరలిస్తుండగా సమాచారం రావడంతో పటమట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రామవరప్పాడు రింగ్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహించారు. వినేష్, కుమారన్ వద్ద గంజాయిని గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేస్తుండగా వారి వద్ద నాటు తుపాకీ ఉంది. 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు. బిహార్‌లో ఈ తుపాకీనికి కొనుగోలు చేసినట్టు వినేష్ అంగీకరించాడు. తన స్వగ్రామంలో ప్రత్యర్థులతో ఉన్న వివాదాల కారణంగా తుపాకీ కొన్నానని చెప్పినట్టు సమాచారం. కొన్నాళ్ల క్రితం బెంగళూరు వెళ్లినప్పుడు అక్కడ హోటల్‌లో పరిచయమైన స్నేహితుడి ద్వారా దీన్ని కొనుగోలు చేశాడు. వినేష్ తన స్వగ్రామంలో వడ్డీ వ్యాపారం చేసేవాడు. అప్పటికే ఈ వ్యాపారంలో ఉన్న వారు వినేష్‌ను అడ్డుకున్నారు. వ్యాపారం విషయంలో వినేష్‌కు వారితో గొడవలు జరిగాయి. వారి నుంచి రక్షించుకోవడానికి ఈ తుపాకీని కొనుగోలు చేశానని పోలీసులకు వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ట్రేడ్ లైసెన్స్‌ల మాయాజాలం

(ఐదోపేజీ తరువాయి)

విస్మయం కలిగించే నిజాలు బట్టబయలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించగా విస్మయం కలిగించే నిజాలు వెలుగు చూశాయి. కొందరు వ్యాపారులను ఆరా తీయగా తాము లైసెన్స్ ఫీజులను కడుతున్నామని, ఆర్థిక సంబంధిత వ్యవహారాలకు లైసెన్స్ తప్పనిసరి కావడంతో కట్టక తప్పడం లేదని పేర్కొన్నారు. కొందరైతే తాము ఫీజు చెల్లిస్తున్నామని, రశీదు మాత్రం చేతికి అందడం లేదని ఆరోపించారు. మరికొందరైతే ట్రేడ్ లైసెన్స్ అంటే ఏమిటి, వ్యాపారం చేయాలంటే తీసుకోవాలా అని అడగటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్టీఆర్ స్టేడియం పరిధిలో 120 వ్యాపారాలు, ఆటోనగర్‌లో సుమారు 500 వరకు వివిధ వ్యాపారాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, మున్సిపాల్టీకి చెందినవి 300 దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్‌లు 500, వివిధ విద్యాసంస్థలు 100, హోటళ్లు, రెస్టారెంట్‌లు 50 ఇవికాక ఇతరత్రా వ్యాపారాలు చాలా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. ఇవి కాకుండా పట్టణ ప్రధాన రహదారుల్లో, వార్డుల్లో, శివారు ప్రాంతాలు, కాలనీల్లో వేలలో వ్యాపారాలు నడుస్తున్నాయి. ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ వ్యవహారంలో మున్సిపల్ అధికారులు ఉదాసీనత వైఖరితో మున్సిపాల్టీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. పట్టణ వ్యాప్తంగా వార్డు సచివాలయ సిబ్బందితో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తే ట్రేడ్ లైసెన్స్‌ల సంఖ్య, వ్యాపారాల లెక్క తేలుతుంది. దీంతో వారితో ట్రేడ్ లైసెన్స్ కట్టిస్తే మున్సిపాల్టీకి ఆదాయం కూడా పెరుగుతుంది. ఆ దిశగా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, మున్సిపల్ ఆర్‌జేడీలు దృష్టిసారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ధరలకే విక్రయించాలి

» అధిక ధరలకు సరుకులు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు

» రైతుబజార్లు, సూపర్ మార్కెట్ల తనిఖీలో మంత్రి నాదెండ్ల మనోహర్

ఆటోనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు వినియోగదారులకు అందిస్తున్నామని, అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రజలకు విక్రయించే సరుకుల నాణ్యత, ధరలపై పటమట రైతుబజార్, ఉషోదయ సూపర్ మార్కెట్లను మంత్రి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు బజార్లో సరుకుల అమ్మకాల్లో వ్యత్యాసాలపై ఎస్టేట్ ఆఫీసర్‌ను నిలదీశారు. బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. గురునానాక్ కాలనీలోని ఉషోదయ సూపర్ మార్కెట్ సరుకుల ధరలు పరిశీలించారు. ప్రభుత్వం కందిపప్పు కిలో రూ.67ను నిర్ణయిస్తే అమ్మకాలు లేకపోవడం గమనించిన మంత్రి సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు. అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ధరలు స్థిరీకరిస్తూ నాణ్యమైన వస్తువులు అందించడమే లక్ష్యమన్నారు.



మానికొండలో సీసీ రోడ్డు నిర్మాణపనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



పెదపులిపాకలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె తదితరులు

పల్లెలకు పూర్వవైభవమే కూటమి లక్ష్యం

పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో ఎమ్మెల్యేలు యార్లగడ్డ, బోడె

ఉంగుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పల్లెలకు పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలో గురువారం నిర్వహించిన పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. నిధులు దారిమళ్లించి గ్రామాల అభివృద్ధిని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి నాశనం చేశాడన్నారు. అనంతరం పలు సీసీరోడ్లు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు భూమి పూజచేశారు. మానికొండలో రూ.40లక్షలు, తరిగొప్పలలో రూ.27.30లక్షలు, వేంపాడులో రూ.25లక్షలు, నందమూరులో రూ.15లక్షలు, వేమండలో రూ.20లక్షలు, ఇందుపల్లిలో రూ.30లక్షలు, జంధ్యాలవారికండ్రికలో రూ.38లక్షలు, వెంకట్రామాపురంలో రూ.23.50లక్షలు, కొయ్యగూరపాడులో రూ.30లక్షలు, పొణుకుమాడులో రూ.6.80లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, అధ్యక్షుడు బర్మా భువనభాస్కర్, యడ్లపల్లి సాయి. ఆరికట్ల రవికుమార్, ఇందుపల్లి యోహాన్, తోట నాగభూషణం, నూతక్కి బెనర్జీ, అజీజ్, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌గా యార్లగడ్డ

ప్రసాదంపాడు: ఎయిర్ పోర్టు కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ మెయింటెనెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఎన్నుకున్నట్టు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో ఆయన భేటీ అయ్యారు. రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు బ్యూటీఫికేషన్ పనుల వివరాలను ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. జీఎం దయాకర్ బాబు, కార్పొరేషన్ ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ అర్కిటెక్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి : బోడె

పెనమలూరు: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జనసేన సమన్వయకర్త ముప్పా రాజాతో కలిసి చోడవరం, పెదపులిపాకల్లో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో రూ.4.30 కోట్లతో నిర్మించ తలపెట్టిన పద్దెనిమిది సీసీ రోడ్ల శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిపిన వైసీపీ ప్రభుత్వం కబంధ హస్తాల నుంచి ప్రజలు బయటపడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల స్ఫూర్తితో మనగ్రామాలను బాగు చేసుకుందామన్నారు. టీడీపీ అధ్యక్షులు మునునూరు శ్రీనివాసరావు, కలపాల శ్రీధర్, సర్పంచులు గుంటూరు శ్రీనివాసచౌదరి, కాకర్ల వెంకటరత్నం, తాతపూడి గణేష్, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, దొండపాటి సురేష్, మునునూరి శ్రీధర్, గుజ్జర్లపూడి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

కాసరనేనివారి పాలెంలో..

కంకిపాడు మండలం కాసరనేనివారి పాలెంలో ఉపాధి హామీ నిధులు రూ. 40 లక్షలతో సీసీ రోడ్డుకు గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఒక్క రోడ్డునైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజ, పెద్దు వరప్రసాద్, నెక్కలపూడి కిరణ్, బాబు రాజేంద్రబాబు, సెంగెపు రంగారావు, నర్రా సతీష్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజాను గెలిపించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడులో జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు అందించిన ఎమ్మెల్సీ ఓటు నమోదు ఫారాలను యార్లగడ్డ ఆవిష్కరించారు. అర్హులైన పట్టభద్రులతో ఓటు నమోదు అధిక సంఖ్యలో చేర్పించాలని సూచించారు. కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

కంకిపాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. కంకిపాడు మండల పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని రాజ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజను గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అబ్బర్వర్లు కంచర్ల ఏడుకొండలు, కావూరి చంద్రమోహన్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, బండి నాంచారయ్య, యలమంచిలి కిషోర్‌బాబు, గోపీచంద్, కంకిపాడు వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, సెంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రాజా

స్కానింగ్ కేంద్రాల నమోదు తప్పనిసరి : డీఎంహెచ్‌వో

పెనమలూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగనిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా నమోదు చేయాలని కృష్ణా జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి పేర్కొన్నారు. గురువారం కానూరులోని ఓ ప్రయివేటు స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలను పీసీపీ, ఎన్డీటీ చట్ట పరిధిలో నమోదు చేయాలన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలుంటాయని వివరించయారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపునూ రద్దు చేస్తామని హెచ్చరించారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గరికపాటి శివశంకర్ తదితరులు

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శకావ్యమైన రామాయణాన్ని రచించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని లోకానికి అందించిన మహాకవి వాల్మీకి మహర్షి అని గరికపాటి శివశంకర్ అన్నారు. బాపులపాడులో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. బోయవానిగా జన్మించి సప్తరుషుల బోధనలతో మహర్షిగా మారిన వాల్మీకి జీవితం యువతకు ఆదర్శప్రాయమని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సహ కన్వీనర్ దావు లూరి శ్రీహరి, వడ్డిల్లి లక్ష్మి,బొత్స వెంకటేశ్వరరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

కంకిపాడులో..

మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జి. విజయలక్ష్మి మాట్లాడుతూ రామాయణం నేటికీ ప్రజాదరణ పొందుతుందన్నారు. ఏవో ఎన్. భవసవయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రసాద్, పునాదిపాడు ఈవో బాబూజి, మంతెన ఎంపీటీసీ బండి శ్రీను, స్వరూప్ పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రేడ్-1 గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి దొండపాటి బాబూరావు, శంకర్, రామచంద్రరాజు, దుర్గాలక్ష్మి, కంభంపాటి ధర్మారావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో టి.స్వర్ణలత, ఎంఈవో కె.రవికుమార్, పీఆర్ఏఈ దాసు తదితరులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నం గ్రంథాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కె.కృపానందం తదితరులు పాల్గొన్నారు.

121 మందికి కంటి పరీక్షలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంటి సంరక్షణలో నిర్లక్ష్యం తగదని డాక్టర్ ఇవాన్ సూచించారు. రంగయ్య ప్పారావుపేటలో కమ్మవారి ఐక్య సేవా సమితి (కేవీఐఎస్)ఆధ్వర్యంలో శంకర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని మారుతీ రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ ఇవాన్ నేతృత్వంలోని వైద్యులు 121మందికి కంటి చూపు నిర్ధారణతో పాటు శుక్లం, రెటీనా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్ ద్వారా ఆపరేషన్లకు ఏర్పాటు చేసినట్టు కేవీఐఎస్ఎస్ అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకొల్లు అన్నామణి, ఉపసర్పంచ్ నలిబోయిన శ్రీనివాసరావు, లింగం శ్రీధర్, అలూరి బాబు, కొల్లిపర శ్రీనివాస్ రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంక సాంబశివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

ఉంగుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరదల్లో ఇళ్లు, పొలాలు మునిగిపోయి దయనీయస్థితిలో వున్న వరదబాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సీబీసీఎన్‌సీ(ఉయ్యూరు)ఫీల్డ్ అధ్యక్షుడు, పాస్టర్స్ కాన్ఫరెన్స్ ట్రెజరర్ ఫాదర్ తిరివీధి పీటర్ అన్నారు. ఎలుకపాడులో సీబీసీఎన్‌సీ ఉయ్యూరు, అవనిగడ్డ ఫీల్డ్ చర్చెస్ సహకారంతో గురువారం 120మంది బాధిత కుటుంబాలకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీచేశారు. మాజీ సర్పంచ్, సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ మున్నంగి నిరీక్షణరావు, నిత్యానందం, అమృతరాజు, రమేష్, శిఖామణి, యోహోషువా, దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు ప్రొద్దుటూరు విద్యార్థులు

ప్రొద్దుటూరు (కంకిపాడు), 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పొద్దుటూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అరుణ కుమారి అన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన కె.మైనశ్రీ, పి.వాగ్దేవీలను గురువారం అభినందించారు. హెచ్ఎం కుమారి మాట్లాడుతూ విజయ వాడలోని పడమట జడ్పీ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. పీడీ రమేష్‌ను అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

నిఘా వ్యవస్థ నిద్రపోదు.. : ఎస్పీ గంగాధర్

కంకిపాడు, అక్టోబరు 17 : మనం నిద్రపోయినా నిఘా వ్యవస్థ నిద్రపోదని కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్ అన్నారు. కంకిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కేమెరాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధర్ మాట్లాడుతూ నేరాలను అరికట్టాలన్నా, నేరాలు జరిగిన తరువాత వాటిని పరిష్కరించాలని సీసీ కేమేరాల నిఘా వ్యవస్థతోనే సాధ్యమవుతుందన్నారు. చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం సులువవుతుందన్నారు. కంకిపాడు మండల పరిధిలోని ప్రధానంగా గోశాల, ఈడుపుగల్లు, గొడవర్రు, పునాధిపాడు, కంకిపాడులోని ప్రధాన కూడలిలో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి పూర్తి బ్యాక్ అప్ కంకిపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్సై అండర్‌లో ఉంటుందన్నారు. కంకిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్ చొరవ తీసుకొని అధిక శాతం కెమేరాలు ఏర్పాటు చేశారన్నారని వివరించారు. అదే విధంగా ఈ 25 సీసీ కెకెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన దాతలను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు సందీప్, తాతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



నిఘా వ్యవస్థను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు

మత్తుపదార్థాలను దరిచేరనీయొద్దు

అవగాహన సదస్సులో ఎస్సై సురేష్

ఉంగుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ సమాజశ్రేయస్సుకు ఎంతో అవసరమని, విద్యార్థులు వీటికి దూరంగా వుండాలని ఆత్కూరు ఎస్సై చావా సురేష్ అన్నారు. నవజీవన్ బాలభవన్(నూజివీడు)ఆధ్వర్యంలో గురువారం ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంపై వచ్చే అనార్థలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చెడు అలవాట్ల బారినపడి బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. మత్తుపదార్థాల జోలికి పోయి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు గంజాయి, ధూమపానం, మద్యం తాగటం, గుట్కా వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యసమస్యలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చునన్నారు. నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటుచేసిన బోస్కో-డీ-ఎడిక్షన్ సెంటర్‌లో మత్తుపదార్థాల బారినపడినవారికి ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 94904 92020 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీబీకే సుధాకర్, నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

యువత బంగారు భవిష్యత్‌కు కృషి

మంత్రులు అనగాని, కొల్లు

గుడ్లవల్లేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువతకు బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , మంత్రి రవీంద్ర అన్నారు. కౌతవరంలో ఆధునీకరించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భవనం, కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నిర్వహణలో నూతన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లను గురువారం మంత్రులు ప్రారంభించారు. రూ.20 లక్షల అంచనాలతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ , నూతన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జరిగిన సభలో సత్యప్రసాద్ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దీపావళికి మహిళలకు ఇంటికి మూ డు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం ప్రారంభించనున్నామని అన్నారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్, జేసీ గీతాంజలీ శర్మ, రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్ గోపాలకృష్ణమూర్తి, జిల్లా సహకార శాఖ అధికారి కె. చంద్రశేఖర్, డివిజినల్ సహకార అధికారి వివి ఫణికుమార్, జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ వల్లభనేని బాబూరావు(కౌతవరం), మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి, పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జి), గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ ఇన్‌చార్జ్ దావులూరి సురేంద్రబాబు, నాన్‌జీ, కౌతవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ గరిమెళ్ల మల్లేశ్వరి, సెక్రటరీ జన్ను భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌతవరం సబ్ రిజిస్ట్రార్ ఆధునిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, రవీంద్ర

గుడివాడ అభివృద్ధికి సహకరించండి

గుడివాడ : గుడివాడ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి అనగానికి ఆర్డీవో, తహసీల్దార్, జిల్లా పరిషత్ అతిథి గృహాలను చూపించారు. ఆయా కార్యాలయాల స్థితిగతులను వివరించారు. గుడివాడలో అత్యాధునిక ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడగా ప్రతిపాదనలు పంపితే వెంటనే అనుమతులు వచ్చేలా చూస్తానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారని మంత్రి అనగాని తెలిపారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నివాస గృహాల మధ్య మద్యం షాపు తొలగించాలి

గుడివాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నివాసగృహాల మధ్య మద్యం షాపును పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఙవిజయవాడ రోడ్డులోని బేతవోలు వాటర్ ట్యాంక్ వద్ద గృహాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానికులు మాట్లాడుతూ చుట్టుపక్కల నివాసగృహాలు ఉంటే మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మద్యం తాగి గొడవలు చేస్తారని, ప్రశాంతంగా ఉన్న తమ ప్రాంతంలో మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

ఫోన్ బాధితులకు

సీఈఐఆర్‌తో భరోసా

అన్నం, నీరు ఎలానో మన యాంత్రిక జీవనానికి మొబైల్ కూడా ఒక అవసరంలా మారింది. ఇప్పుడు మొబైల్ లేకుండా ఎవరూ బయటికి అడుగు పెట్టడం లేదు. అలాంటి మొబైల్ ఫోన్ పోయిందంటే మన శరీరంలో ఏదో భాగం కోల్పోయినట్టే అన్నట్టు తయారైంది. దీంతో కేంద్రం ప్రభుత్వం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను ప్రవేశపెట్టింది. ఇది మన ఫోన్‌ను క్షణాల్లో కనిపెట్టేస్తుంది.

- ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్



రాష్ట్రంలో సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు పరిష్కరించిన కేసులు ఇలా..	
బ్లాక్ చేసిన మొబైల్ ఫోన్లు	66,904
గుర్తించినవి	36,875
రికవరీ చేసినవి	13,023

కేంద్ర టెలికం శాఖ ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయో తెలుసుకోవడంతో పాటు పోయిన సెల్‌ఫోన్లను ట్రాక్ చేయడానికి సంచార్ సాథి వెబ్‌సైట్‌ను రూపొందించింది. దీన్నే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)గా పిలుస్తారు. ఎన్టీఆర్‌జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదులను ఇక నుంచి సీఈఐఆర్ ద్వారా స్వీకరించాలని నిర్ణయించారు. ఇందులో ఫిర్యాదును రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల ఒక డిజిటల్ రికార్డు ఉంటుంది. ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్‌లో మూడు దశల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో పెరుగుతున్న ఫిర్యాదులు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజుకు 10 నుంచి 15 వరకు ఫోన్లకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయి. విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనున్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వస్తున్నారు. కొంతమంది సమీప స్టేషన్లకు వెళ్తున్నారు.

పోలీస్ సేవలు ఇలా..

ఫోన్ ట్రాక్ అయిన తర్వాత పోలీసులు ఫిర్యాదుదారులకు సమాచారం ఇస్తారు. ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు, ఆధార్‌కార్డు చూపించిన తర్వాత ఫోన్‌ను వారికి అందజేస్తారు. పోయిన ఫోన్ ట్రాక్ అవ్వగానే దాన్ని ఉపయోగిస్తున్న వ్యక్తులను పట్టుకుని స్వాధీనం చేసుకుంటారు. ఇలా స్వాధీనం చేసుకున్న ఫోన్లకు సంబంధించి ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తారు. ఆ కోడ్‌ను బాధితులకు పంపుతారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే పోయిన ఫోన్‌కు సంబంధించి ఐఎంఈఐ నంబర్ వస్తుంది. అదే క్యూఆర్ కోడ్‌ను పోలీసులు స్కాన్ చేస్తే ఫిర్యాదుదారుడి మొత్తం వివరాలు డిస్‌ప్లే అవుతాయి.

సీఈఐఆర్‌లో ఫిర్యాదు ఇలా..

మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్‌లో 3 దశల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ముందుగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో గానీ, సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయాలి. ఈ ఫిర్యాదును స్వీకరించి రిసెప్షన్‌లో ఉన్న సిబ్బంది ఒక నంబరు కేటాయిస్తారు. ఈ ఫిర్యాదు కాపీని బాధితులు ఫొటోస్టాట్ తీసుకోవాలి. లేకపోతే ఫోన్‌లో ఫొటో తీసుకోవచ్చు. తర్వాత సీఈఐఆర్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఫోన్‌లో గానీ, కంప్యూటర్‌లో గానీ తెరవాలి. వెబ్‌సైట్ తెరుచుకోగానే బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్, అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్, ఫర్‌గాట్ రిక్వెస్ట్ ఐడీ పేర్లతో బాక్స్‌లు కనిపిస్తాయి. ఇందులో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ బాక్స్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ కనిపిస్తుంది. దీనికి మూడు దశల్లో పూర్తి చేయాలి.

మిస్ అయిన ఫోన్ల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్

- సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్‌తో మెరుగైన ఫలితాలు
- ఇక ఫిర్యాదుల స్వీకరణకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ నిర్ణయం
- ఫోన్ల ట్రాకింగ్‌కు ప్రత్యేకంగా టెక్నికల్ టీం

24 గంటల్లో అప్‌డేట్

సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన 24 గంటల్లో అప్‌డేట్ వస్తుంది. ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్లను అన్ని సర్వీసు ప్రొవైడర్లకు పంపుతారు. ఈ ఫోన్లను ట్రాక్ చేయడానికి సైబర్ ల్యాబ్‌లో నిత్యం ఇద్దరు పోలీసులు పనిచేస్తారు. ఇలా చేయడం ద్వారా రోజుకు నాలుగు నుంచి ఐదు సెల్‌ఫోన్లను ట్రాక్ చేస్తారు.

-గుణరాము, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ.6.26 కోట్లు



హుండీలను లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది.

వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు గురువారం రెండో రోజు కూడా కొనసాగింది. బుధ, గురువారాల్లో మొత్తంగా రూ.6,26,97,047లు కానుకల రూపేణ వచ్చాయి. 412 గ్రాముల బంగారం, 15 కిలోల 823 గ్రాముల వెండి లభించింది. యుఎస్ఏ డాలర్లు 355, యూరప్ యూరోస్ 5, 1.5 ఒమాన్ రియాల్లు, 900 బైసాలు, 35 ఇంగ్లండ్ పౌండ్లు, 20 ఫిజీ డాలర్లు, 16 సౌదీ రియాలు, 20 అరబ్ ఎమిరేట్స్ దీర్హాలు, 2 మలేషియా రింగెట్లు, 50 కెనడా డాలర్లు, 5 కువైట్ దీనార్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 6 సింగపూర్ డాలర్లు లభించాయి. కాగా, రెండవ రోజు లెక్కింపులో రూ.2,76,68,347లు కానుకలు రూపేణ వచ్చాయి. 16వ తారీఖున, రూ.3,50,28,700లు కానుకల రూపేణ వచ్చాయి. విదేశీ కరెన్సీ యుఎస్ఏ, యూరప్, ఒమన్, ఇంగ్లండ్, ఫిజీ, సౌదీల నుంచి కానుకల రూపేణ వచ్చాయి.

ఘనంగా దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

దుర్గగుడి ఆధ్వర్యంలో గురువారం ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంలో భాగంగా గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షణను నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం వీరు శ్రీనివాస శాస్త్రి, ఉద్యోగులు, భక్తులతో కలిసి ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ సాగిన భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల భజనల నడుమ భక్తిపారవశ్యంలో అమ్మవారి గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. అనేక చోట్ల భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. చిట్టినగర్ ప్రాంతంలోకి వచ్చేటప్పటికీ అనుకోని విధంగా వాన పడింది. ఈ సమయంలో ఉత్సవమూర్తులు తడవకూడదన్న ఉద్దేశంతో పైన ఆచ్ఛాదనను ఏర్పాటు చేసినప్పటికీ వాన జోరు కావటంతో ఉత్సవమూర్తులను ప్రచార రథంలోకి మార్చారు. అక్కడ పూజాధికాలు నిర్వహించిన తిరిగి గిరి ప్రదక్షణను కొనసాగించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొడుతున్న దుర్గగుడి ఈవో రామారావు

తిరుపతమ్మకు రూ.కోటికిపైగా హుండీ ఆదాయం

పెనుగంచిప్రోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి భక్తులు సమర్పించిన హుండీల కానుకల ద్వారా రూ.కోటి 3 లక్షల 85 వేల 16 నగదు, అమెరికన్ డాలర్లు 620, ఆస్ట్రేలియా 100, యూరోలు 10, రుకింగ్ ఒకటి పాయ, బడ్స్ 20తోపాటు 65 గ్రాముల బంగారం, ఒక కేజీ 50 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్టు డిప్యూటీ కమిషనర్ బిహెచ్.ఎస్.ఎస్.కిషక్షర్ కుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాను ఎన్డీయేకి కంచుకోటగా మారుద్దాం

- ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చేఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థులు భయపడేలా ఓట్ల నమోదు చేయించి ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, ఎన్టీఆర్ జిల్లాను ఎన్డీయే కూటమి కంచుకోటగా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సామినేని ఉదయభాను గురువారం ఎంపీ శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సామినేని ఉదయభానును ఎంపీ శివనాథ్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్డీయే నేతలు, కార్యకర్తలతో వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి పాలన చూసి ప్రజలంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు సన్నద్ధంగా ఉన్నారన్నారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఎన్డీయే కూటమి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి చూస్తారన్నారు. జనసేన పార్టీ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన నేతలు బొలిశెట్టి వంశీకృష్ణ, అక్కల గాంధీ, కామేష్, టంకసాల సుబ్బారావు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నేతలు శ్యామ్ ప్రసాద్, ఎస్.కృష్ణ ప్రసాద్, బీజేపీ నేతలు రెడ్డిపల్లి రాజు పాల్గొన్నారు.



ఉదయభానును సత్కరిస్తున్న శివనాథ్, ఎంపీతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఎంపీని కలిసిన ఇన్‌చార్జి మంత్రి సుభాష్

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఎంపీ సాదరంగా ఆహ్వానం పలికారు. వీరి మధ్య కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి చర్చించుకున్నారు.

నూతన ఆర్టీసీ ఈడీలకు సత్కారం

బస్‌స్టేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హౌస్‌లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎ) జి.వి. రవివర్మ, టి. చెంగల్‌రెడ్డి (ఈ), ఆర్థిక సలహాదారు, ముఖ్య గణాంక అధికారి ఎస్. సుధాకర్‌ను గురువారం ఆర్టీసీ హౌస్‌లో ఈయూ రాష్ట్ర కమిటీ నేతలు మర్యాదపూర్వకంగా సత్కరించారు. పూలబొకేలు, దుశ్శాలువాలతో వారిని సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీ రవివర్మకు గురువారం రాష్ట్ర కార్మిక పరిషత్ నేతలు ఆర్టీసీ హౌస్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈడీగా బాధ్యతలు చేపట్టిన రవివర్మ, చెంగల్‌రెడ్డిని నుకార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరి, కోసూరి సురేంద్ర, ఎస్.ప్రభాకర్, వై.రమేష్ కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.

రైతు బజార్‌లో మొండి బకాయిలు..?

- అద్దెలకు ఎగనామం పెడుతున్న వ్యాపారులు



విజయవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేదారేశ్వపేట రైతు బజారులో స్టాల్స్ నిర్వహిస్తున్న కొంతమంది వ్యాపారులు అద్దెలు ఎగనామ పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి అద్దెలు కట్టకుండా వ్యాపారం కొనసాగిస్తుండటం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు గమనించారు. గత ప్రభుత్వంలో సెంట్రల్ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో ఈ వ్యాపారులు అద్దెలు కట్టకుండా బెదిరింపులకు పాల్పడ్డారని సమాచారం. అలా అద్దె అడిగిన సదరు ఈవోను సస్పెండ్ చేయటమే కాక ఉద్యోగం నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 43 మంది స్టాల్ నిర్వాహకులు రూ.4లక్షల బకాయిలు చెల్లించారు. ఇంకా 25 మంది రూ.14 లక్షల బకాయిలు పడ్డారు. వీటిని వారంలో వసూలు చేయాలని నిర్ణయం తీసుకొన్నట్లు ఈవో రమేష్ తెలిపారు.

నిలిచిన బదిలీలు

రైతు బజార్లలో ఐదేళ్లుగా బదిలీలు నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లాలోని 15 రైతు బజార్లలో పనిచేస్తున్న ఎస్టేట్ అధికారులు ఒకేచోట ఐదేళ్లుగా తిష్ట వేసుకొని కూర్చున్నారు. పటమట, కృష్ణలంక, భవానీపురం, గాంధీనగర్, కంచికచెర్ల, గవర్నర్‌పేట, జగ్గయ్యపేట సహా 15 రైతు బజార్లలో ఐదేళ్లుగా ఉన్న ఎస్టేట్ అధికారులు చక్రం తిప్పుతున్నారు. మార్కెటింగ్ శాఖలో ప్రతి రెండేళ్లకోసారి బదిలీలు చేయడం సంప్రదాయం. గత ప్రభుత్వంలో ఈ విధానాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో అధికారుల బాధ్యతలు, సమర్థతపై ప్రశ్నలు రావడం సహజం. ఇకనైనా, రైతులకు మెరుగైన సేవలందించేలా కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఇంజనీర్లకు అదనపు బాధ్యతలు

- జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి సర్కిల్, తెలుగు గంగ ప్రాజెక్టు (శ్రీకాళహస్తి)లో పనిచేస్తున్న పోలూరు చంద్రశేఖరయ్యకు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ బాధ్యతలను అదనంగా ఇచ్చారు. నెల్లూరు సోమశిల సర్కిల్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న కోట సుబ్రహ్మణ్యేశ్వరరావుకు నెల్లూరు సోమశిల ప్రాజెక్టు డివిజన్-2 బాధ్యతలు అప్పగించారు. విజయవాడ ఇరిగేషన్ డివిజన్‌కు చెందిన రావెళ్ల రవికిరణ్‌కు విజయవాడ కృష్ణా కెనాల్ డివిజన్-2, కృష్ణా కెనాల్ డివిజన్ బాధ్యతలు చూస్తున్న చెల్లుబోయిన గోపీనాథ్‌కు గుడివాడ ఇరిగేషన్ డ్రైనేజీ డివిజన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న రాయపాటి విజయలక్ష్మికి ఒంగోలులోని వినుకొండ క్వాలిటీ కంట్రోల్ డివిజన్, కావలి ఎస్‌ఎస్ డివిజన్‌లోని ముజాహిద్‌ఖాన్‌కు కావలి ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ, పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ బాధ్యతలు నిర్వహిస్తున్న మేడిశెట్టి కిశోర్‌కు కాకినాడ డ్రైనేజీ డివిజన్, పొదిలి ఇరిగేషన్ డివిజన్‌కు చెందిన శివరామ ప్రసాద్‌కు ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్, మద్దిపాడు జీఆర్‌పీ డివిజన్‌లోని షైక్ రవికు వెలిగొండ ప్రాజెక్టు జీఆర్‌పీ-2 అదనపు బాధ్యతలు అప్పగించారు.



విరాళం.. ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్నా ఆర్పీఎఫ్ సెక్యూరిటీస్ ఎండీ సుంకర రాజేశ్, తదితరులు

కాలువలు ఇలా .. నీరుపారేదెలా..!

- ప్రతిపాదనలకే పరిమితమైన బెడ్‌డ్యామ్ నిర్మాణ పనులు
- వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌లు



పిచ్చిమొక్కలతో నిండిన పంట కాల్వ (ఫైల్‌ఫొటో)

ఆంధ్రజ్యోతి - తిరువూరు: మెట్టప్రాంతమైన తిరువూరు నియోజకవర్గంలో సరైన సాగు నీటి వనరులు లేకపోవడంతో, చెరువులమీదే ఆధారపడి వ్యవసాయం సాగుతుంది. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన వధకాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఎన్ఎస్పీ కాల్వల్లో ఎప్పుడు సాగునీరు విడుదల చేస్తారో తెలియని పరిస్థితిలో సాగు గాలిలో దీపంలా మారింది. పట్టణ పరిధిలోని ఏడు చెరువులకు, తెలంగాణ ప్రాంతంలోని గుట్టపాడు వద్ద పడమటి వాగునుంచి సప్లయి ఛానల్(రాకట్టు ఛానల్)ద్వారా, కోకిలంపాడు కట్టలేరు డ్యామ్ నుంచి సప్లయిఛానల్ ద్వారా ఆంజనేయపురం, చిట్యాల, టేకులపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి సాగునీరు చెరుతుంది. ఇటీవల ఈ కాలువలను కొంతమేర అభివృద్ధి చేయడంతో ఈ చెరువులకు సాగునీరు చేరింది. దీంతో కొంతమేర సాగునీటి ఎద్దడి తీరినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో సాగునీటి తీవ్రత అధికంగానే ఉంది. మండలంలో కొన్ని వాగుల నుంచి ఆయా ప్రాంతాల్లో చెరువులకు సాగునీరు చేరేందుకు సప్లయిఛానళ్లు ఉన్నాయి. అయితే వాగుల్లో దీర్ఘకాలం క్రితం నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ఇటీవలి వరదలకు కొట్టుకుపోయాయి. దీంతో నీరు వృధాగా దిగువ ప్రాంతాలకు చెరుతోంది.

మండలంలోని చిట్యాల వద్ద కట్టలేరు వాగుపై బెడ్‌డ్యామ్ నిర్మాణ పనులు ఎప్పటికి ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. చిట్యాల వద్ద కట్టలేరు బ్రిడ్జి సమీపంలో సప్లయి ఛానల్ ద్వారా చి ట్యాల ఆయకట్టుకు నీరందుతోంది. దీంతోపాటుగా, టేకులపల్లి, గానుగపాడు, చౌటపల్లి పరిధిలోని చెరువులకు, సాగు భూ ములకు నీరు అందుతుంది. ప్రస్తుతం వా గులో వరదలొచ్చిన ప్పుడు మినహా , సప్ల యి ఛానల్‌కు నీరందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో శాశ్వతంగా బెడ్‌డ్యామ్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు 2017-2018 కాలంలో సుమారు రూ.4.88 కోట్ల అంచనాలతో బెడ్‌డ్యామ్ నిర్మాణ ప్రతిపాదనలు సంబంధిత శాఖకు పంపారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నాతాధికారులు సైతం బెడ్‌డ్యామ్ నిర్మాణానికి ప్ర తిపాదించిన స్థలాన్నీ పరిశీలించారు. ఈ పనులు ప్రతిపాదనలకే పరిమితమవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

చిట్యాల కట్టలేరు వద్ద బెడ్‌డ్యామ్ ని ర్మించడం వల్ల ఈ ప్రాంతంలో లిఫ్టు ఏ ర్పాటుతో పిటికొత్తూరు, రేలుపడి ప్రాంతాలకు సాగునీటిని మళ్లించే అవకాశం ఉం టుందని రైతులు పేర్కొంటున్నారు. చి ట్యాల వద్ద కట్టలేరులో బెడ్‌డ్యామ్ ని ర్మిస్తే, అక్కడ లిఫ్టు ఏర్పాటు చేసి పిటి కొ త్తూరు ప్రాంతంలో ఎన్ఎస్పీ కాల్వకు నీ టిని మళ్ళిస్తే కొన్ని వందల ఏకరాలకు సా గునీరు అందుతుందని ఆప్రాంత రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సాగు ఎక్కువశాతం వర్షాధారంగా సాగవు తుంది. గతంలో చిట్యాల కట్టలేరు నుంచి లిఫ్ట్ ద్వారా సాగునీరు ఈ ప్రాంతానికి అం దించాలని పలువురు రైతులు గత ప్రభుత్వాల హయాంలో వినతీపత్రాలు అందించారు. పాలకులు, అధికారులు నియోజకవర్గంలో సాగు నీటి వనరుల అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

విద్యాధరపురం స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలి

అధికారులకు శాప్ చైర్మన్ సూచన



స్టేడియం నిర్మాణ పనులనుపరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమలోని విద్యాధరపురం లేబర్ కాలనీలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయడు అధికారులను కోరారు. శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిషాతో కలిసి గురువారం స్టేడియం ప్రాంగణంలో నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేడియం నిర్మాణ నమూనాను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించారు. శాప్ ఈఈ సిద్ధయ్య, ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, ఏపీ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

నేటితరం యువత మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శాప్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శాప్ చైర్మన్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు.గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీ పైనా స్కూల్లో చదువుతున్న ఎం ఆధ్య (స్వర్ణం, 3 రజతాలు), వై విజయలక్ష్మి (స్వర్ణం, 2 రజతాలు) బి. కీర్తనసాయి (స్వర్ణం, కాంస్యం), బి లక్షితారెడ్డి (స్వర్ణం), ఎం రోషన్ కిషన్ (కాంస్యం) స్కేటింగ్‌లో సత్తా చాటి పతకాలు సాధించారు. వీరిని శాప్ కార్యాలయంలో చైర్మన్ రవినాయుడు అభినందిస్తూ ఇందుకు కృషి చేసిన కోచ్ కె. కల్యాణ్‌ను ప్రశంసించారు.

ఏడాది తర్వాత నకిలీ విద్యార్హతల కేసు పురోగతి!

రైల్వే సంఘ్ నేతపై చార్జ్ ఫ్రేమ్స్‌కు రంగం సిద్ధం

- తప్పుడు విద్యార్హతలేనని తేల్చిన రైల్వే విజిలెన్స్ విభాగం
- ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఇచ్చిన కీలక ఆధారాలతో కేసు కొలిక్కి
- చార్జ్ ఫ్రేమ్ వేసేందుకు సిద్ధమౌతున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/రైల్వేస్టేషన్): నకిలీ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నేత ఆకుల రాఘవేంద్రపై రైల్వే ఉన్నతాధికారులు చార్జ్ ఫ్రేమ్ విధించటానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. డివిజన్‌లో పనిచేస్తున్న రాఘవేంద్ర విద్యార్హతలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందటంతో గతేడాది విజిలెన్స్ విభాగం విచారణ జరిపింది. ఈ విచారణలో జిల్లా విద్యాశాఖాధికారులు అవి నకిలీ సర్టిఫికెట్లేనని తేల్చటంతో విచారణ ముగింపు దశకు చేరుకుంది. అధికారులు పూర్తి ఆధారాలతో రైల్వే ఉన్నతాధికారులకు నివేదికను పంపారు. ఏడాది కాలం పాటు కేసులో పురోగతి లేదు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. ఏడాది క్రితం సీఎన్‌డబ్ల్యూ విభాగంలో ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాడనే ఆరోపణలు రావటంతో అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా ఆ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించి ఉద్యోగం పొందాడు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరాడని ఆధారాలున్న సంఘ నేతపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం రైల్వే అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో ఉన్నతాధికారులు ఈ కేసును తేల్చమని అధికారులకు నిర్దేశించినట్టుగా తెలుస్తోంది. ఈమేరకు డివిజన్ అధికారులు చార్జిషీటు తయారుచేసినట్టు తెలిసింది. ఈ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఏం చేస్తారన్నది వేచి చూడాల్సిందే!

మహర్షి వాల్మీకి జీవితం గొప్ప స్ఫూర్తి పథం

- ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జీవితం, ఆయన సమాజానికి అందించిన రామాయణ మహాకావ్యం గొప్ప స్ఫూర్తి పథమని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం గురువారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి సంకల్పిస్తే ఏదైనా సాధించగలమని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ధర్నాచౌక్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు లేక పేద వర్గాలు ఆయా రంగంలో ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగం తగ్గిపోయి 90 శాతం ప్రైవేట్‌రంగం పెరిగిందన్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రైవేట్‌రంగంలో స్థానికులకు కోటా కల్పిస్తున్నా అవి సక్రమంగా అమలు జరగడంలేదన్నారు. సోషలిస్టు జాతీయ నేత ఎల్.జైబాబు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి వర్గాలు పరిశ్రమల్లో, సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి విముఖత చూపడం సరైందికాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోరంక అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి ఓర్సు వీర భాస్కర్, వెల్‌ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేయం.ఎ.సుభాన్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి నేత ఫణిరాజ్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు గిద్దా శ్రీనివాస్‌నాయుడు, నగర మాజీ మేయర్ తాడి శకుంతల పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య?

పెనమలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోసాల హరిజనవాడకు చెందిన గుల్లంకి రవికుమార్ అనే కౌలు రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్నట్టు అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న రాత్రి 11గంటలకు అతడు పురుగుమందు తాగి వాంతులు చేసుకుంటుండగా కుటుంబసభ్యులు పటమటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మృతుడి ఆత్మహత్యకు సరైన కారణం కోసం దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505

గోపాలకృష్ణకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పరామర్శ



చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ కమ్యూనిస్టు నేత అత్తలూరి గోపాలకృష్ణను సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన గోపాలకృష్ణ చల్లపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నారాయణ చల్లపల్లి వచ్చి గోపాలకృష్ణను పరామర్శించి ఆయనకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మల్లుపెద్ది అజయ్‌కుమార్, బోసు తదితరులున్నారు.

ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకే వంటనూనె విక్రయాలు

మచిలీపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుబజార్లు, సూపర్ బజార్లు, హోల్‌సేల్ వర్తకుల ద్వారా జిల్లాలో 27 ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి సన్‌ఫ్లవర్, పామోలిన్ తక్కువ ధరలకే విక్రయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఎస్‌వో పార్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు ఉన్న వారికి లీటర్ సన్‌ఫ్లవర్ రూ.124 లకు, పామోలిన్ లీటరు రూ.114కు విక్రయించడం జరుగుతుందన్నారు. అర లీటరు ప్యాకెట్లు కూడా ఉన్నాయన్నారు.

కంచడం, రామకృష్ణాపురంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు

మచిలీపట్నం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు బ్యాంక్ ఉన్నతాధికారులు అంగీకరించినట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లి మండలం కంచడం, కోడూరు మండలం రామకృష్ణాపురంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

పెడన రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆటస్థలాలు ఉన్నాయా, ఉంటే ఏవిధంగా ఉన్నాయనే అంశంపై పాఠశాల విద్యాశాఖ రీజినల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్ బాషా గురువారం పెడనలో పర్యటించారు.. జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు తీర్థావతి, డ్రిల్ మాస్టర్ ఉమామహేశ్వరరావులతో మాట్లాడారు. ఆటస్థలాలున్నా కొన్నిచోట్ల నిరుపయోగంగా ఉన్నాయని వాటిని వినియోగంలోనికి తెచ్చి విద్యార్థులలో ఆటలపై మక్కువ కలిగేలా ప్రోత్సహిస్తామన్నారు. గంగాధర్, మురళీకృష్ణ, శాస్త్రి, నాగలక్ష్మి, ఉషశ్రీ పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నిబాధిత వీరబాబు కుటుంబానికి పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ వీవీఆర్ ట్రస్టు ద్వారా రూ.15 వేలు ఆర్థిక సాయమందించారు. పెద్ది భాస్కరరావు, బడే వీరబాబు, నష్టం బాపయ్య, శివరామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, వివిఆర్ ట్రస్టు ప్రతినిధి విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, భూపాటి నాంచారయ్య, ముసలయ్య, బర్మా బుజ్జి, ప్రతాప్, స్థానికులు దాసరి విజయ్, బసవయ్య, జరుగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెండా దిమ్మెలకు అనుమతి ఇవ్వొద్దు

నాగాయలంక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ విగ్రహం పక్కన ఏ రాజకీయ పార్టీల జెండా దిమ్మెల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ ఎస్సీ నేతలు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. జైపాల్, తానంకి వేణు, మేడికొండ ప్రకాశరావు,కె.శంకరరావు, చీరాల తుఫాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రయాణం..నరకం

- చిట్టూర్పు - ఘంటసాల వయా జోడుగూడెం రహదారి పొడవునా ప్రజలకు తిప్పలే
- మూడున్నర కిలోమీటర్లలో అవస్థలు అన్నీఇన్నీకావు
- గుండేరు వద్ద కోతకు గురైన రహదారి
- దళితవాడ వద్ద కుంగిన రోడ్డు
- వంతెన సమీపంలో అభివృద్ధి చేయని వైనం

చిట్టూర్పు - ఘంటసాల వయా జోడుగూడెం రహదారి అధ్వానంగా తయారైంది. మూడున్నర కిలోమీటర్ల ఈ రహదారిలో దళితవాడ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. గుండేరు వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనాలు డ్రెయిన్లో పడే ప్రమాదం పొంచి ఉంది. వంతెన సమీపంలో రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో బురదకయ్యగా మారింది. పల్లె పండగ నేపథ్యంలో ఈ మూడున్నర కిలోమీటర్ల రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరతుతున్నారు.



వంతెన సమీపంలో అభివృద్ధి చేయక బురదకయ్యగా మారిన రహదారి



గుండేరు వద్ద కోతకు గురైన రహదారిని చూపుతున్న రైతులు

ఆంధ్రజ్యోతి - ఘంటసాల : చిట్టూర్పు - ఘంటసాల వయా జోడుగూడెం రహదారిని గతంలో నాబార్డు, ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.2 కోట్లతో అభివృద్ధిపర్చారు. జోడుగూడెం దళితవాడ సమీపంలో సీసీ రహదారిగా అభివృద్ధి పర్చి మిగిలిన రహదారిని తారురోడ్డుగా అభివృద్ధిపర్చారు. ఈ రోడ్డు చివర సుమారు 200 మీటర్ల రహదారి అభివృద్ధిని వదిలేశారు. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి నడిచేందుకు వీల్లేకుండాపోయింది. చిట్టూర్పు, జోడుగూడెం వాసుల ఈ రహదారే ఆధారం. ఇటీవల ఈ రహదారి రెండు చోట్ల కోతకు గురైంది. దళితవాడ సమీపంలో ఒక చోట, గుండేరు వంతెన సమీపంలో మరొక చోట జారిపోయింది. గుండేరు వంతెన సమీపంలో మూడు వంతులకుపైగా రహదారి కోతకు గురై రెండు అడుగుల లోతు కుంగి గుండేరు డ్రెయిన్‌లోకి జారింది. ద్విచక్ర వాహనాలు తప్ప ఈ రహదారిలో ఆటోలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. జోడుగూడెం కాలనీ వాసులు ఆసుపత్రికి రావాలన్నా, నిత్యావసరాల కోసమైనా, ప్రభుత్వ కార్యాలయాలకు రావాలన్నా ఈ రహదారే శరణ్యం. ఘంటసాల - దేవరకోట, చిట్టూర్పు రైతాంగానికి ఈ రహదారి వెంబడి మాగాణి భూములు ఉండటంతో వ్యవసాయ పనులు చేసుకునేందుకు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకునేందుకు ఈ రహదారి మరో 40 రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానుండటంతో రహదారి దుస్థితిని చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన ప్రాంతాన్ని ఆర్ అండ్ బి అధికారులు పరిశీలించి వెళ్లి అభివృద్ధిపర్చలేదని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన ప్రాంతాలను అభివృద్ధి పర్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.



దళితవాడ సమీపంలో కోతకు గురై కుంగిన రహదారి

కోతకు గురైన ప్రాంతాన్ని అభివృద్ధిపర్చండి



ప్రధాన రహదారి రెండు అడుగుల లోతులో కోతకు గురైంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే లోపు కోతకు గురైన ప్రాంతాన్ని అభివృద్ధిపర్చాలి.

- కొడాలి శేషగిరిరావు

రివిట్‌మెంట్ చేయాలి



దళితవాడకు సమీపంలో రహదారి కోతకు గురైంది. పశువులకు నీరు పెట్టేందుకు, బటలు శుభ్రపర్చుకునేందుకు కాలనీ వాసులు వెళ్తారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. కోతకు గురైన ప్రాంతాన్ని రివిట్‌మెంట్ చేయాలి

-చిట్టూర్పు వాసుదేవరావు

కొంత ప్రాంతాన్ని వదిలేశారు!



గుండేరు వంతెన సమీపంలో సుమారు 200 మీటర్లకుపైగా రహదారిని అభివృద్ధిపర్చలేదు. వర్షం వస్తే బురదకయ్యగా ఉంది. కాంట్రాక్టర్ చేతులు దులుపుకోగా, అధికారులు పట్టించుకోవటం లేదు. **-చిట్టూరి ఆదిశేషు**

రహదారిని అభివృద్ధి పరుస్తాం

అధిక వర్షాలకు గుండేరు డ్రెయిన్ పొంగి రహదారి బలహీనపడి జారింది. ఈ విషయమై కాంట్రాక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాము. ప్రధాన రహదారికి సంబంధించిన నిధులు చాలక పోవటంతో కొంతమేర రహదారి అభివృద్ధి ఆగింది. ఆ ప్రాంతాన్ని కూడా అభివృద్ధిపరుస్తాం.

- రమేష్, ఆర్ అండ్ బీ డీఈ

ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన భారతీయ కళలను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిట్టూర్పులో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాట పోటీల విజేతలకు గురువారం ఆయన బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అన్ని తాళం భజన, మురళీ కోలాట సమాజాలను ఆయన అభినందించారు. తాళం భజన పోటీల్లో పమిడిముక్కల మండలం అమీనాపురం గ్రామానికి చెందిన శ్రీరాజరామ భక్త సమాజం మొదటి బహుమతి గెలుచుకోగా, రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మురళీకోలాటం పోటీల్లో పామర్రుకు చెందిన మద్దుల మురళీకృష్ణ సమాజం మొదటి బహుమతి గెలుచుకోగా, నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. యోగా టీచర్ శేష ప్రసన్న - నాగరాజు ఆధ్వర్యం లో నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న గ్రామ ప్రముఖులు గుత్తికొండ వరప్రసాద్ - రాజ్యలక్ష్మి దంపతులను, గ్రామస్థులను అభినందించారు. అధికార భాషా సంఘం మాజీ సభ్యురాలు డాక్టర్ డి.మస్తానమ్మ, అంతర్జాతీయ మహిళా సేవా సంస్థ ఛైర్మన్ జి.అరుణ శ్రీ, అంతర్జాతీయ మహిళా సంస్థ అధ్యక్షురాలు జయశ్రీ, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.మునిరత్నం నాయుడు, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తాళం భజన పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వారికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

యండకుదురులో వాల్మీకి జయంతి

ఘంటసాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జయంతిని పురస్కరించుకుని వాల్మీకి చిత్రపటానికి యండకుదురు సచివాలయం వద్ద సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపనలతో పల్లెల్లో పండుగ వాతావరణం



పెదప్రోలులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మండలి



మల్లాయిచిట్టూరులో వెంకట్రామ్..



రుద్రవరంలో గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు ..

మోపిదేవి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మోపిదేవి, పెదప్రోలు గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్‌లు ఏసుబాబు, మేరీరాణి, జానకి రాంబాబు, ఎంపీపీ రావి దుర్గావాణి, మల్లికార్జునరావు, మండలి వెంకట్రామ్, జనార్దనరావు, శ్రావణి, పవన్‌కుమార్ రంగారావు, నాదెళ్ల శరత్‌చంద్ర ప్రసాద్ ఎంపీడీవో స్వర్ణభారతి పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల : మల్లాయి చిట్టూర్పు, పూషడం, యండకుదురు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ భూమి పూజ చేశారు. పూషడంలో రూ.9.45 లక్షలతో నిర్మించే సీసీ రహదారికి, మల్లాయి చిట్టూరులో రూ.10 లక్షలతో మూడు సీసీ రహదారులకు, రూ.5 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. యండకుదురులో రూ.13.60 లక్షలతో నిర్మించే రెండు సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా, సర్పంచ్‌లు అంకం మారుతిరావు, ఆవుల రేవతి, ముళ్లపూడి పట్టాభి రామారావు, ఆవుల ధర్మవెంకట నరసయ్య, లోయ నాగ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చింతల నాగబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బందరు మండలంలో..

మచిలీపట్నం టౌన్ : మండలంలోని రుద్రవరం, గుండుపాలెం, చిన్నాపురం గ్రామాల్లో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, గోకులాల పనులకు తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్, టీడీపీ నాయకులు నీలం రామకృష్ణ, తూమాటి బసవశంకరరావు, బీరం రమేష్, మైనేని రాజేంద్రరావు, కాగిత గోపాలరావు, నిరంజనరావు, పున్నారావు, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారి పనులకు కాగిత శంకుస్థాపన



గూడూరు : గూడూరు, ఆకులమన్నాడు, కప్పలదొడ్డిలో రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు పోతన స్వామి, అన్నం హరిరామకృష్ణ, ఎస్‌పి బేగ్, గోపీ నాగబాబు, పోతన రామోజీ, కట్టా మునేశ్వరరావు, దాసరి సాయిరామ్, కొల్లపల్లి రజని, గూడూరు, ఆకులమన్నాడు, సర్పంచ్‌లు లింగం సులోచనారాణి, ఎండి రఫీ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు 900 ఎకరాల మునక



కమ్మనమోలులో ఇంజన్లతో నీటిని బయటకు తోడుతున్న రైతులు

నాగాయలంక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజుల నుంచి మండలంలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక కాల్వ చివరి పొలాలు ముంపు బారినపడ్డాయి. కమ్మనమోలు, గణపేశ్వరం, గుల్లలమోద, ఎదురుమొండి, పర్రచివర గ్రామాల్లో 900 ఎకరాలలో వరి పంట ముంపు బారిన పడినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. సముద్రం ఎగదన్నడం, అవుట్ పాల్ స్లూయిస్‌లోని వరద నీరు బయటకుపోవకపోవటంతో వరి పొలాలు ముంపు బారిన పడినట్లు రైతులు తెలిపారు. గత 20 రోజుల క్రితమే నాట్లు వేసినట్లు రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు బారిన వరి పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ముంపు బారిన పడిన పొలాల్లోని నీరును అన్నదాతలు ఇంజన్లు పెట్టి డ్రెయిన్‌లోకి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు వ్యవసాయ విస్తరణాధికారి సురేష్ తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



ఎమ్మెల్యే కాగితకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బంటుమిల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ అందజేశారు. మాజేటి శివశ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును కొనసాగిస్తూ రూ.1281 కోట్లను తిరిగి జమ చేయాలని కోరారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి మాట్లడుతూ ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలన్నారు.

బార్ కౌన్సిల్ వెల్ఫేర్ స్టాంపు విడుదల



స్టాంపును విడుదల చేస్తున్న బార్ అధ్యక్షుడు బూరగడ్డ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బార్ కౌన్సిల్ ముద్రించిన రూ.250 వెల్ఫేర్ స్టాంపును గురువారం మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ విడుదల చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మద్యం షాపు పెట్టొద్దంటూ రామానగరంలో ఆందోళన

చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామానగరంలో మద్యం షాపు పెట్టొద్దంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. రామానగరం శ్మశాన వాటిక ప్రాంగణంలోని దుకాణాల్లో మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో స్థానికులు ఆందోళనకు దిగారు. షాపు మరో చోట ఏర్పాటు చేసుకోవాలంటూ డిమాండ్ చేశారు. తొలుత రోడ్డుకు అడ్డంగా బైఠాయించినప్పటికీ, తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా షాపు వద్ద నిరసన తెలిపారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి వచ్చి స్థానికులతో మాట్లాడారు. షాపు ఏర్పాటుచేయబోమని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని ప్రజలు స్పష్టంచేశారు. మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ తహసీల్దార్, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144,155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

పామర్రు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బల్ల వేణు(24), దున్నా నాగపూర్ణిమ (35) మచిలీపట్నం నుంచి ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్తుండగా బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. రోడ్డు క్రాస్ చేస్తున్న వ్యక్తితోపాటు వేణు, నాగపూర్ణిమలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను విజయవాడ ఆసుపత్రికి హైవే అంబులెన్సులో చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతు బల్లిపర్రు అడ్డ రోడ్డను క్రాస్ చేస్తున్న వ్యక్తి రాత్రి 10గంటలకు మృతి చెందాడు. అతడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పామర్రు ఎస్సై సిఅవీనాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాస గృహాల మధ్య మద్యం షాపు తొలగించాలి

గుడివాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నివాసగృహాల మధ్య మద్యం షాపును పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. విజయవాడ రోడ్డులోని బేతవోలు వాటర్ ట్యాంక్ వద్ద గృహాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానికులు మాట్లాడుతూ చుట్టుపక్కల నివాస గృహాలు ఉంటే మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మద్యం తాగి గొడవలు చేస్తారని, ప్రశాంతంగా ఉన్న తమ ప్రాంతంలో మద్యం షాపును వెం టనే తొలగించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

కౌతవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పరిశుభ్రతకు నార్ల కుమారుడు విరాళం

గుడ్లవల్లేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిశుభ్రతకు నార్ల గంగాధర్ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు చెక్ అందజేశారు. కౌతవరం విద్యుత్ సబ్ స్టేషన్‌ను డస్ట్‌బిన్‌లా తయారు చేశారని గతంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి పునాదులు వేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ బోర్డు చైర్మన్ దివంగత నార్ల తాతారావు కుమారుడు నార్ల గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. కౌతవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం తిలకించారు. వెంటనే స్పందించి రూ. 70 వేల చెక్కును అక్కడికి దగ్గరలో పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి హాజరైన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు మంత్రుల సమక్షంలో అందజేశారు. సబ్‌స్టేషన్‌ను క్లీన్ చేయించాలని కోరారు.



మంత్రి అనగానికి చెక్కు అందజేస్తున్న నార్ల గంగాధర్

యువత బంగారు భవిష్యత్‌కు కృషి

గుడ్లవల్లేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువతకు బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , మంత్రి రవీంద్ర అన్నారు. కౌతవరంలో ఆధునీకరించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భవనం, కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నిర్వహణలో నూతన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లను గురువారం మంత్రులు ప్రారంభించారు. రూ.20 లక్షల అంచనాలతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ , నూతన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జరిగిన సభలో సత్యప్రసాద్ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దీపావళికి మహిళలకు ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం ప్రారంభించనున్నామని అన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్, జేసీ గీతాంజలీ శర్మ, రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్ గోపాలకృష్ణమూర్తి, జిల్లా సహకార శాఖ అధికారి కె. చంద్రశేఖర్, డివిజినల్ సహకార అధికారి వివి ఫణికుమార్, జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ వల్లభనేని బాబూరావు(కౌతవరం), మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి, పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ ఇన్‌చార్జ్ దావులూరి సురేంద్రబాబు, నాన్‌జీ, కౌతవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ గరిమెళ్ల మల్లేశ్వరి, సెక్రటరీ జన్ను భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌతవరం సబ్ రిజిస్ట్రార్ ఆధునిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రుల సత్యప్రసాద్, రవీంద్ర



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ అభివృద్ధికి సహకరించండి

గుడివాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి అనగానికి ఆర్డీవో, తహసీల్దార్, జిల్లా పరిషత్ అతిథి గృహాలను చూపించారు. ఆయా కార్యాలయాల స్థితిగతులను వివరించారు. గుడివాడలో అత్యాధునిక ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడగా ప్రతిపాదనలు పంపితే వెంటనే అనుమతులు వచ్చేలా చూస్తానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారని మంత్రి అనగాని తెలిపారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కూరాడలో రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



వానపాములలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పెదపూడిలో సీసీ రహదారుల శంకుస్థాపనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

గుడ్లవల్లేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం గుడ్లవల్లేరు మండలం చినగొన్నూరు, పురిటిపాడు, కట్టానిచెరువు, శేరిదగ్గుమిల్లి, కూరాడ గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాము పాల్గొని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పలు రహదార్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలో దాదాపు 78 అంతర్గత రహదారుల నిర్మాణం ఈ పల్లెపండగ కార్యక్రమంలో చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కాగిత నరేంద్ర, ఈడే మోహన్, ప్రసాద్, రమేష్, నవాబు, నగేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, చిలంకుర్తి వెంకటేష్, శ్రీరామచంద్రరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి మండలంలో..

పెదపారుపూడి : పల్లెలను పట్టణాలతో దీటుగా అభివృద్ధి చేయటమే ప్రభుత్వ ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వానపాముల, కొర్నిపాడు, వెంట్రప్రగడ, మోపర్రు గ్రామాల్లోని సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ జరిగిందని తెలిపారు. మోపర్రులో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పల్లె అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, తహసీల్దార్ వై.రంగారావు, ఈవోపీఆర్డీ వంగ శ్రీనివాస్, పీఆర్ ఏఈ రామ్మోహనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉజ్జనేని అనిల్ కుమార్, నాయకులు జూపల్లి రాజేష్, కాగిత లక్ష్మీనారాయణ, దూళ్ల జమ్మిబాబు, కూచిపూడి సుబ్బయ్య, పాతూరి రమేష్, చిలక అంజనేయులు, చప్పిడి కిషోర్, చిలక ధనరాజ్, దగాని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో...

కూచిపూడి : పల్లె పండుగతో రహదారుల రూపురేఖలు మారుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మొవ్వ మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 96 లక్షలతో 16 సీసీ రహదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. పెదపూడి, యద్దనపూడి, అయ్యంకి, చినముత్తేవి గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో వాకా బాలకృష్ణ, కొమ్ము సౌధామణి, నాగనబోయిన సునీల్, వీరంకి తులసీదాస్, తాతా ప్రభాకరరావు, తాతా శివాజీ, పరుచూరి సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ ఎన్.వాసుదేవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్, కార్యదర్శి వి.ప్రభుకుమార్, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లోను విద్యార్థులు రాణించాలి

తోట్లవల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించటం అవసరమని టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో గురువారం అండర్ -14, అండర్- 17 విభాగంలో బాల బాలికలకు నియోజకవర్గస్థాయి యోగా, చెస్ సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పణి రాజమోహన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జి జవహర్‌బాబు, పీడీలు లక్ష్మణరావు, బాలస్వామి, మణి, రవీంద్రబాబు నందకిషోర్, వల్లూరు శ్రీనివాసరావు, గ్లాడిసన్ ఆధ్వర్యంలో యోగా, చెస్ పోటీలు నిర్వహించి జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం నున్నలో జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జవహర్‌బాబు తెలిపారు.



క్రీడాకారుల నుద్దేశించి మాట్లాడుతున్న గురుమూర్తి

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడివాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఉప్పులూరు - నిడమానూరు రైల్వే స్టేషన్ మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కొలుసు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడి కుడిచేతికి స్టీల్ కడియం, ఎరుపు రంగు తాడు, ఒంటిపై గోధుమరంగు ప్యాంటు ఉందని తెలిపారు. మృతుని సమాచారం తెలిసినట్లయితే గుడివాడ రైల్వే ఎస్సై సెల్ నెం. 94406 27570కు తెలియజేయాలని హెచ్‌సీ శ్రీనివాసరావు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మోటార్ ఇంజన్లకు నష్టపరిహారం చెల్లించాలి

నందివాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బుడమేర వరదల్లో నష్టపోయిన మోటారు ఇంజన్లకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో పుట్టగుంట సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. పుట్టగుంట పరిధిలో 35 మంది రైతుల మోటార్లు వరదల వల్ల దెబ్బతిన్నాయని, ఒక్కొక్క మోటారు రిపేరు చేయించాలంటే రూ.12 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణ రెడ్డి, స్థానికులు లచ్చిరెడ్డి ప్రసాద్, పరుచూరి కోటేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, తోట రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కుమార్ రాజాకు వినతి పత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నేతలు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి : వర్ల

పామర్రు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన భవన నిర్మాణ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పామర్రు నియోజకవర్గ భవన నిర్మాణ కార్మికుల సంఘ నేతలు వారి సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టేల తీసుకోచ్చిన జీవో 1214ను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు తిరిగి తీసుకురావాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా కోశాధికారి వేము పెద బాబు, టి.శ్రీనివాసరావు పామర్రు నేతలు జహారుద్దీన్ ఖాన్, దాసరి కొండబాబు, ముళ్లపూడి విల్సన్, ఇంటూరి రాజు, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్



మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో..



పామర్రు ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో..

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

గుడవాడ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : హిందూ సంస్కృతీ, సంప్రదాయాలు ఉన్నంత కాలం మహర్షి వాల్మీకి హిందువుల్లో జీవించి ఉంటారని ఎంపీడీవో వి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి వల్లే ఈ రోజు సంప్రదాయాలు పరిఢమిల్లాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఎంఈవో, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కూచిపూడి :** మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, ఆర్ఐ విజయదుర్గ, మండల సర్వేయర్ ఏ.కిషోర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు. **పామర్రు :** పామర్రు ప్రభుత్వం డీగ్రీ కళాశాలలో జరిగిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు కేఆర్‌జి శేషకుమార్ పాల్గొని వాల్మీకి జీవితం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు మాధవి, ఇ.సునీత, రవి తదితరులు పాల్గొన్నారు.



గంగానమ్మకు కుమార్‌రాజా ప్రత్యేక పూజలు

పెదపారుపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మోపర్రు గ్రామంలో ఉన్న గంగానమ్మ తల్లిని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగానమ్మ తల్లి 12వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి మహిళలు పొంగళ్లు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బోయిన సాంబశివయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ఉజ్జనేని అనిల్, ఉజ్జనేని రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకే వంటనూనె విక్రయాలు

మచిలీపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుబజార్లు, సూపర్ బజార్లు, హోల్‌సేల్ వర్తకుల ద్వారా జిల్లాలో 27 ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి సన్‌ఫ్లవర్, పామోలిన్ తక్కువ ధరలకే విక్రయించేందుకు ఏర్పాట్లు చేసి న ట్లు డీఎస్‌వో పార్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు ఉన్న వారికి లీటర్ సన్‌ఫ్లవర్ రూ.124 లకు, పామోలిన్ లీటరు రూ.114కు విక్రయించడం జరుగుతుందన్నారు. అర లీటరు ప్యాకెట్లు కూడా ఉన్నాయన్నారు.

గోపాలకృష్ణకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పరామర్శ

చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ కమ్యూనిస్టు నేత అత్తలూరి గోపాలకృష్ణను సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన గోపాలకృష్ణ చల్లపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నారాయణ చల్లపల్లి వచ్చి గోపాలకృష్ణను పరామర్శించి ఆయనకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మల్లుపెద్ది అజయ్‌కుమార్, బోసు తదితరులున్నారు.



వైసీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ

పెదపారుపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వానపాముల గ్రామంలో మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు ఎలిసి డేవిడ్ రాజు తల్లి పెద్దకర్మ కార్యక్రమం గురువారం జరిగింది, ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, వానపాముల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతులకు రుణాలివ్వండి

» వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటునివ్వండి

» బ్యాంకర్ల కమిటీకి మంత్రి అచ్చెన్న విజ్ఞప్తి



ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి అచ్చెన్నకు మొక్క అందజేస్తున్న అధికారులు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటు అందించాలని, కౌలు రైతులకు మానవతా దృక్పథంతో రుణాలిచ్చి, వ్యవసాయాభివృద్ధికి సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. అమరావతి సచివాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో వివిధ బ్యాంకుల లక్ష్యాలు, 2024 ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధించిన ప్రగతి, వార్షిక రుణ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాలు, డిజిటల్ పేమెంట్స్ వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఫైనాన్షియల్ లిటరసీపై ఆర్బీఐ ప్రచురించిన పుస్తకాన్ని అచ్చెన్నాయుడు ఆవిష్కరించి, మాట్లాడారు. 'రాష్ట్రంలో ఈ ఏడాది 9లక్షల మందికి కౌలు గుర్తింపు కార్డులివ్వగా, 2లక్షల మందికే పంట రుణాలిచ్చారు. కౌలు రైతుల పట్ల బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. లక్ష్యం మేరకు రుణాలివ్వాలి' అని కోరారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించడానికి బ్యాంకులు ముందుకు రావాలని కోరారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రాధాన్య రంగాలకు రూ.3.75 లక్షల కోట్ల రుణాలివ్వాలన్న లక్ష్యంలో రూ.1.36లక్షల కోట్ల రుణాలు(36%) పంపిణీచేసినట్లు బ్యాంకర్లు తెలిపారు.

కేరళ తరహాలో తీరప్రాంత అభివృద్ధి: అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తీరప్రాంతాన్ని కేరళ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో మత్స్యశాఖపై మంత్రి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎనిమిది హార్బర్ల అభివృద్ధికి దశలవారీగా చర్యలు తీసుకోవాలన్నారు. వేట నిషేధకాలంలో మత్స్యకారుల జీవన భృతిని రూ.20వేలకు పెంచి అందించేందుకు లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తిచేయాలన్నారు. మత్స్యశాఖ ద్వారా గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తిరిగి అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. మత్స్యశాఖ ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.

నాణ్యమైన వైద్యసేవలు ప్రజల హక్కు

» ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవల్ని ఆశించే హక్కు ప్రజలకు ఉందని, వారి అంచనాల మేరకు పని చేయడం వైద్య సిబ్బంది బాధ్యతని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రుల నిర్వహణ, సేవల్ని మెరుగుపర్చి, వీటి పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని కలిగించేందుకు రెండునెలల క్రితం రూపొందించిన 30 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళిక అమలుపై గురువారం మంత్రి సమీక్షించారు. అంశాల వారీగా జీజీహెచ్‌ల్లో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల అధికారులు తమ ప్రయత్నాల్ని, వాటి ఫలితాల్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి రూ.240 కోట్ల విలువైన డయాగ్నోస్టిక్ పరికరాలు, 725 మంది సహాయకులు, 300 మంది స్టాఫ్ నర్సుల అవసరం ఉందని వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు వివరించారు. వివిధ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్ల కొరత ఉందని చెప్పారు. వీటితోపాటు పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతను తీర్చడానికి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ సిరి

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ ఎ.సిరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

13 మంది సీనియర్ సివిల్ జడ్జీలకు పదోన్నతి

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పని చేస్తున్న 13 మంది సీనియర్ సివిల్ జడ్జీలకు జిల్లా జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందినవారిలో ఎం.ఇందిర ప్రియదర్శిని, వి.భవాని, వై.నాగరాజ, సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, ఎస్.కవిత, ఎం.అనురాధ, సీహెచ్.వెంకట నాగశ్రీనివాసరావు, ఏ.అనిత, పి.రాజారాం, కె.విజయకళ్యాణి, బి.లక్ష్మీనారాయణ, బి.అప్పలస్వామి ఉన్నారు.

కౌంటర్ దాఖలుకు సమయమివ్వండి

» జెత్వానీ కేసులో హైకోర్టుకు ఏజీ అభ్యర్థన

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో నమోదైన వివిధ కేసులను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. కేసుకి సంబంధించి కౌంటర్ దాఖలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యాసాగర్ వ్యాజ్యంపై విచారణ వాయిదా

సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను హైకోర్టు ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈలోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. అరెస్టుతో పాటు రిమాండ్‌ను సవాల్ చేస్తూ విద్యాసాగర్ వేసిన వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదించారు.

ఖాజీల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి ఫరూక్

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఖాజీల సమస్యలన్నీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఖాజీల సంఘం ప్రతినిధులు మంత్రికి వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఖాజీనే నియమించాలని కోరారు. న్యాయమైన, సహేతుకమైన సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని, దుల్హన్ పథకంపై గత ప్రభుత్వం విధించిన అసమంజస నిబంధనలను మార్చాలని ఖాజీల సంఘం ప్రతినిధులు కోరారు.

'కార్తీకం'లో ఆలయాల్లో పటిష్ఠ ఏర్పాట్లు

» ఈవోలకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో భక్తుల సౌకర్యార్థం దేవాలయాల్లో పటిష్ఠమైన ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆలయాల ఈవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భక్తులకు పంపిణీ చేసే ప్రసాదాలతో పాటు అన్నప్రసాదంలోనూ నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆలయాల బయట ఉండే దుకాణాల్లో ధరలు నియంత్రించడంతో పాటు ధరల పట్టికను కచ్చితంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి ప్రధాన ఆలయాల్లో క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆలయ రథం, ఇతర ముఖ్యమైన విగ్రహాలు ఉన్న కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

ఢిల్లీ, చెన్నై మెట్రోలకు డ్రైవర్ రహిత రైళ్లు

సరఫరా చేసిన శ్రీసిటీలోని అల్‌స్టోమ్ కంపెనీ

శ్రీసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, చెన్నై మెట్రోలకు అత్యాధునిక డ్రైవర్ రహిత మెట్రో రైళ్లను శ్రీసిటీలోని అల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా లిమిటెడ్ సరఫరా చేసింది. పరిశ్రమ ప్రతినిధుల సమాచారం మేరకు.. ఢిల్లీ మెట్రో 4వ దశ విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.2,800 కోట్ల ఒప్పందంలో భాగంగా మొదటి విడతగా 52 డ్రైవర్ రహిత మెట్రో పాలిస్ రైలు సెట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 23న ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు(డీఎంఆర్‌సీ) అందజేసింది. ఒక్కో రైలు సెట్ ఆరు పెట్టెలను కలిగి ఉంటుంది. ఇందులో 13 రైలు సెట్లను ఏరో సిటీ నుంచి తుగ్లకాబాద్ వరకు కొత్తగా నిర్మించిన 25.8 కిలోమీటర్ల పొడవైన గోల్డ్ లైన్-10 కోసం రూపొందించారు.

చెన్నై మెట్రోకు 36 రైలు సెట్ల సరఫరా

చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో దశ విస్తరణ ప్రాజెక్టు కోసం 36 డ్రైవర్ రహిత రైలు సెట్లను సరఫరా చేసింది. ఈ కాంట్రాక్ట్ విలువ రూ.1,215.92 కోట్లు. ఒక్కో రైలు సెట్‌లో మూడు పెట్టెలు ఉంటాయి. ఈ రైళ్లు 4వ కారిడార్‌కు సంబంధించిన పూందమల్లి- పోరూరు మధ్య నడవనున్నాయి. 2025 నాటికి రాకపోకలు ప్రారంభం కానున్నాయి. శ్రీసిటీ-అల్‌స్టోమ్‌లో తయారైన ఈ మెట్రోపాలిస్ మెట్రోరైళ్లు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపర్చడంలో, పట్టణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని అల్‌స్టోమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆలివర్ లాయినస్ పేర్కొన్నారు.



చెన్నై మెట్రోకు పంపిన రైలు

సైబర్ క్రైమ్.. కేరాఫ్ చైనా, తైవాన్..!



» ఆరు నెలల్లో రూ.8 కోట్లు లూటీ

» టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ పేరిట దోపిడీ

» చైనా, తైవాన్ నుంచి సైబర్ నేరగాళ్ల ముఠా ఆపరేషన్

» వారికి సహకరిస్తున్న ఏడుగురు విశాఖ వాసులు అరెస్టు

» ప్రధాన నిందితుల కోసం గాలింపు: సీపీ శంఖబ్రతబాగ్చి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, బ్యాంక్ చెక్‌బుక్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డులు



సాయిరాం, గిరీష్ (నిందితులు)

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చైనా, తైవాన్‌ల నుంచి వల వేస్తారు... బెట్టింగ్ యాప్‌లు, టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ పేరు చెప్పి ట్రాప్ చేస్తారు.. బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి సొమ్ములు కాజేస్తారు. తర్వాత ఆ మొత్తాన్ని చైనా, తైవాన్‌లలోని బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకుంటారు. ఈ మొత్తం వ్యవహారంలో చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న విశాఖ పట్నం ముఠాను నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా చెక్‌బుక్‌లు, గుర్తింపులేని పత్రాలతో తీసుకున్న సిమ్‌కార్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు.

చైనాలో డ్రైవర్‌గా పనిచేసి వచ్చి..

విశాఖ నగరానికి చెందిన సూర్యమోహన్ చైనాలో చాలాకాలం డ్రైవర్‌గా పనిచేసి.. తర్వాత తిరిగి వచ్చేశాడు. చైనాలో ఉన్నప్పుడు సైబర్ మోసాలకు పాల్పడే ముఠా సభ్యులతో పరిచయం ఏర్పడింది. నగరానికి వచ్చిన తర్వాత తన స్నేహితుడైన విశాలాక్షి నగర్‌కు చెందిన సాయిరాం (28) ఆర్థిక ఇబ్బందులను గమనించి... బ్యాంకు అకౌంట్ వివరాలు చెబితే చైనా ముఠా డబ్బులు ఇస్తుందని తెలిపాడు. దీంతో సాయిరాం టెలిగ్రాం యాప్‌లో చైనా, తైవాన్‌కు చెందిన వారి గ్రూపుల్లో చేరి తన బ్యాంకు ఖాతా సమాచారం ఇచ్చాడు. దీనికోసం అతనికి నెలకు రూ.5వేలు ఇస్తామని ఆ ముఠా ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సాయిరాం తన స్నేహితుడైన మద్దిలపాలేనికి చెందిన గిరీష్ కుమార్ (29)ను కూడా అదే గ్రూపులో జాయిన్ చేసి.. అతని బ్యాంకు ఖాతా వివరాలు కూడా ఇప్పించాడు. ఆ తర్వాత వారిద్దరూ మరికొన్ని గ్రూపుల్లో చేరి చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు దగ్గరయ్యారు.

ఏప్రిల్ నుంచి 8 కోట్లు హాంఫట్

సైబర్ నేరగాళ్లు చైనా, తైవాన్‌ల నుంచి బెట్టింగ్ యాప్‌లు, టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ మోసాలు వంటి సైబర్ నేరాల ద్వారా అమాయకుల నుంచి కొల్లగొట్టిన డబ్బును సాయిరాం, గిరీష్ ద్వారా ఇక్కడి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించేవారు. ఆ తర్వాత వాటిని తాము చెప్పిన చైనా, తైవాన్ బ్యాంకు ఖాతాలకు బదలాయింపు చేసుకునేవారు. ఈ కార్యకలాపాల కోసం సాయిరాం, గిరీష్‌లు విశాలాక్షి నగర్‌లోని అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్, కాల్‌సెంటర్ కోసమంటూ బీచ్ రోడ్డులోని ఏఎన్‌బీచ్ ఆస్పత్రి సమీపంలో మరో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. కాల్‌సెంటర్‌లోకి ఎనిమిది మంది యువతులను ఉద్యోగంలోకి తీసుకున్నారు. విశాలాక్షి నగర్‌లోని ఫ్లాట్‌లో కొరియర్ ద్వారా వచ్చే బ్యాంకు ఖాతాల వివరాలు, ఖాళీ సిమ్‌కార్డులు, డెబిట్ కార్డులు, సెల్‌ఫోన్లను భద్రపరిచేవారు. ఎవరైనా టెలిగ్రాం యాప్, బెట్టింగ్ యాప్‌ల ద్వారా చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు కనెక్ట్ అయితే డబ్బు డిపాజిట్ కోసం ఒక అకౌంట్ నంబర్‌ను వారికిచ్చేవారు. ఆ అకౌంట్ వివరాలతోపాటు, ఏ సిమ్ కార్డు వాడాలనేది చైనా, తైవాన్ ముఠా నిర్దేశించేది.

బాధితులు ఫిర్యాదు చేస్తే సిమ్ బ్లాక్

బాధితులు ఎవరైనా తాము మోసపోయామని ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాళ్లు వెంటనే ఆ బ్యాంకు ఖాతా, సిమ్ కార్డుని బ్లాక్ చేసేవారు. ఇలా పోలీసులకు చిక్కకుండా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.8 కోట్లు వరకూ కొల్లగొట్టారు. దీనిపై గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన నిఘా విభాగం పోలీసులు సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందజేశారు. దీంతో బుధవారం రాత్రి రెండు చోట్ల దాడిచేసిన పోలీసులు కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురు యువతులు, విశాలాక్షి నగర్‌లో సాయిరాం, గిరీష్‌లను పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా డ్యూటీ దిగిన మరో ఇద్దరు యువతులను కూడా అరెస్టు చేశారు.

బుకింగ్ సమయం 60 రోజులే

» రైల్వే రిజర్వేషన్ నిబంధనల్లో మార్పు

» నవంబరు 1నుంచి అమలులోకి...

విశాఖపట్నం, న్యూఢిల్లీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలో ప్రయాణానికి 120 రోజులు ముందుగానే బెర్తులు రిజర్వు చేసుకునే వెసులుబాటు ప్రస్తుతం అమలులో ఉంది. ఈ గడువును 60 రోజులకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిబంధన నవంబరు 1 నుంచి అమలులోకి వస్తుంది. అక్టోబరు 31 వరకు 120 రోజుల గడువుతో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రైల్వే అడ్వాన్స్ బుకింగ్ టికెట్ల వ్యవధిపై నిర్ణయాలు మార్చుకుంటూ వస్తోంది. గతంలో 120 రోజుల గడువు ఉండగా అది దుర్వినియోగం జరుగుతున్నదని ఆరోపణలు రావడంతో 60 రోజులకు కుదించారు. అది 2015 మార్చి వరకు అమలైంది. ఆ తరువాత మళ్లీ 120 రోజులకు పెంచారు. ఇది సుదీర్ఘంగా తొమ్మిదేళ్లు నడిచింది. ఈ నెలాఖరుతో దీనిని కూడా కుదించి, నవంబరు ఒకటో తేదీ నుంచి మళ్లీ 60 రోజులకే పరిమితం చేస్తున్నారు.

ఎందుకంటే...?

120 రోజులు ముందుగా టికెట్లు బుక్ చేసుకుంటున్న వారు ఆ తర్వాత ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. కాన్సిలేషన్ 21 శాతం వరకూ ఉంటోంది. సీట్లు, బెర్తులు వృథా అవుతున్నాయి. అవసరమైనవారు ఉపయోగించుకోలేకపోతున్నారు. మరో 5 శాతం అయితే ఆఖరు వరకు టికెట్ ఉంచుకొని రైలు ఎక్కడం లేదు. ఇలాంటి సందర్భాల్లో అవకతవకలు జరుగుతున్నాయి. ఎవరైతే రాలేదో.. వారికి బదులు వేరే వారిని పంపిస్తున్నారు. వారి వివరాలు రైల్వే వద్ద ఉండడం లేదు. ప్రమాద ఘటనలు, నేరాలు జరిగినప్పుడు వారిని గుర్తించడం కష్టమవుతోంది. రైల్వే అధికారులు కూడా ప్రయాణికులు గైర్హాజరైతే ఆ బెర్తు లేదా సీటును అధికారికంగా చూపించకుండా వేరొకరికి ఇచ్చి డబ్బులు జేబులో వేసుకుంటున్నారు. తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే రైళ్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. 120 రోజుల సమయం ఉండడంతో ఆయా రైళ్లలో కొందరు ముందుగానే టికెట్లు బ్లాక్ చేసి పెట్టుకొని ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. బుకింగ్ గడువు కుదించడం వల్ల నిజమైన ప్రయాణికులు టికెట్లు తీసుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. తక్కువ వ్యవధి ఉండడం వల్ల కాన్సిలేషన్లు తగ్గే అవకాశం ఉంది.

తీరం దాటిన వాయుగుండం

» కోస్తా, సీమల్లో విస్తారంగా వర్షాలు

» పలుచోట్ల భారీ నుంచి అతి భారీగా..

» మరో 4 రోజులపాటు వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం గురువారం తెల్లవారుజామున చెన్నైకు ఉత్తరాన తీరం దాటింది. రాష్ట్రానికి ముప్పు తప్పిపోయింది. తర్వాత అది ఉత్తర తమిళనాడు దిశగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. గురువారం రాత్రికి అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు కోడూరులో 14, పుల్లంపేటలో 10, విశాఖపట్నం, పెనుకొండలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.





నంద్యాల జిల్లా మాకినేనిపల్లెలో నీటమునిగిన వరి, నందికొట్కూరు మండలం వడ్డెమానులో నీటిలో తేలుతున్న ఉల్లిపంట

పలుచోట్ల భారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో గురువారం విస్తారంగా వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి.. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న తడిసి మొలకలు వచ్చింది. చాగలమర్రి, తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో ఎనిమిది మట్టిమిద్దెలు కూలిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలంలోని మల్లెంపల్లి వద్ద వంగపేరు నది ఉధృతంగా ప్రవహించింది. కొడపగానిపల్లి సమీపంలోని సత్యసాయి పంప్‌హౌస్ వద్దగల బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మవరంలోని సంజయ్‌నగర్‌లో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో అత్యధికంగా 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కళింగపట్నం, బందరువానిపేట, బారువ, ఇద్దివానిపాలెం ప్రాంతాల్లో భారీ ఎత్తున కెరటాలు ఎగిసిపడ్డాయి. ఇద్దివానిపాలెంలోకి సముద్రపునీరు వచ్చేసింది.



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ అలకవారివీధిలో సముద్ర కెరటాల ధాటికి కూలిన ఇళ్లు

పశ్చిమలో ముందుకొచ్చిన సముద్రం

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చినలంక, పీఎం లంక వద్ద 50 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. ఒడ్డున వున్న కొబ్బరి తోటలు, సరుగుడు తోటల్లోకి నీరు చేరింది. అలల హోరుకు ప్రజలు భయందోళన చెందారు. గురువారం మధ్యాహ్నం వరకు తీర ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. విశాఖ నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ వర్షం కురిసింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం ప్రకటించింది. 19న రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

వణుకుతున్న ఉప్పాడ తీరం

» కెరటాల తాకిడికి దెబ్బతిన్న బీచ్ రోడ్డు

» ఇబ్బందిపడుతున్న వాహనదారులు

» తీరంలో కోతకు గురవుతున్న ఇళ్లు

» ఇళ్లలోకి వచ్చిపడుతున్న నీరు

కొత్తపల్లి, అక్టోబరు 17: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి తీవ్రంగా ఉంది. తీరంలో గురువారం సాయంత్రం నుంచి ఈదురుగాలులు పెరిగాయి. రెండు మూడు మీటర్ల ఎత్తున కెరటాలు ఎగిసిపడుతున్నాయి. బీచ్‌రోడ్డులో విద్యుత్‌ప్లాంటు సమీపంలో చిన్న వంతెనపై అలలు ఎగసిపడుతున్నాయి. కెరటాల ధాటికి తారురోడ్డుపై కంకరరాళ్లు పైకి తేలాయి. బీచ్‌రోడ్డులో ప్రయాణానికి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. తీరంలోని మత్స్యకారుల గృహాలు సముద్ర కెరటాల ధాటికి అల్లాడుతున్నాయి. కెరటాల తాకిడికి కొన్ని ఇళ్లు కోతకు గురికాగా, మరికొన్ని ఇళ్లలోకి నీరు వచ్చిపడుతోంది.

22న మరో అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా, ఒడిశాకు మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఈ నెల 23వ తేదీ తర్వాత ఏర్పడే తుపాన్/తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తా, ఒడిశా దిశగా వస్తుందని అంచనా వేస్తున్నారు. గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ నుంచి వచ్చే ఉపరితల ఆవర్తనం ఈ నెల 20న ఉత్తర అండమాన్ సముద్రంలో ప్రవేశిస్తుంది. దీని ప్రభావంతో ఈ నెల 21 లేదా 22న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది 23 లేదా 24న తీవ్ర వాయుగుండం/తుపాన్‌గా బలపడే అవకాశం ఉందని, ఒడిశా తీరం దిశగా పయనిస్తుందని కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం తీర ప్రాంత జిల్లాలను అప్రమత్తం చేసింది. ఒడిశాకు ఆనుకుని ఉన్న ఉత్తర కోస్తా జిల్లాలపై ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే కొన్ని మోడళ్ల ప్రకారం చూస్తే మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం బలపడి పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ దిశగా వెళ్లే అవకాశం ఉందని రిటైర్డు వాతావరణ అధికారి ఒకరు పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వస్తుందని చెప్పారు.



అనంతపురంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, కాల్వ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు తదితరులు

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడం టీడీపీతోనే సాధ్యం

» టీడీపీ హయాంలోనే దీనిపై శాస్త్రీయ అధ్యయనం

» వైసీపీ అధికారంలోకి వచ్చి దానిని నాశనం చేసింది: మంత్రి సవిత

» అనంతలో ఘనంగా రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం టీడీపీతోనే సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శాస్త్రీయ అధ్యయనం చేయిస్తే... 2019 అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దానిని నాశనం చేశారని మండిపడ్డారు. అనంతపురంలో గురువారం రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత పాతూరు పవర్ ఆఫీస్ సర్కిల్లోని వాల్మీకి విగ్రహానికి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషివల్లే వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై అసెంబ్లీలో చర్చించి, కేంద్రానికి పంపారని తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసికట్టుగా కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

సర్వప్రజానీకానికి మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి: సీఎం

మూల రామాయణ రచయిత మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని లోకానికి చాటిన మహా పురుషుడు వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నందుకు సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా తెలిపారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే సౌమ్య, పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీరాంచినబాబు, దూండీ రాకేష్ తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

సీఎం సహాయనిధికి దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేశ్‌కు గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌ను దాతలు కలిసి, విరాళాల చెక్కులు అందజేశారు. కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన సాయితేజ విద్యానికేతన్ యాజమాన్యం రూ.4.25లక్షలు, దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు రూ.2.50లక్షలు, విశాఖపట్నానికి చెందిన దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసీ డి.సూర్యప్రకాశరావు రూ.2,06,782 ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు.

జగన్ పత్రికపై కేసు నమోదు

విజయవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికపై విజయవాడ పటమట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హైకోర్టు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదుపై ఈ కేసును నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రజల మధ్య అశాంతిని రెచ్చగొట్టేలా జగన్ మీడియాలో కథనాలు ప్రచురిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బీఎన్ఎస్ 196(ఎ), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.